నేడు ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి దత్తు నాయక్ జిల్లా అధ్యక్షుడు వడ్ల సత్యనారాయణ జిల్లా కార్యనిర్వాక అధ్యక్షుడు పద్ధతి లక్ష్మణ్ జిల్లా సహాయ కార్యదర్శి నాగరాజులతో కలిసి ఆయన ఈఎస్ఐ ప్రియరంజన్ సిన్హా డైరెక్టర్ ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పర్వతాలు మాట్లాడుతూ జిల్లాలో షాద్నగర్ నుండి కాటేదాన్ వరకు మహేశ్వరం నుండి చేవెళ్ల వరకు విస్తరించి ఉన్న వేలాది పరిశ్రమలలో లక్షలాది మంది కార్మికులు పనిచేస్తున్నారు.

సాఫ్ట్వేర్ ఉద్యోగులు అంతర్జాతీయ విమానాశ్రయంలో పనిచేసే ఎంప్లాయిస్ ఫ్యూచర్ సిటీ నిర్మాణంలో ఉన్న కార్మికులు ఇలా లక్షలాది మంది కార్మికులు పనిచేస్తున్న ప్రాంతంలో ఈఎస్ఐ ఆసుపత్రి లేకపోవడం వల్ల కార్మికులకు అనారోగ్యం వస్తే సనత్ నగర్ లేదా నాచారం వెళ్లి చికిత్స చేయించుకోవడం కోసం వైద్యం కోసం ఒకరోజు వేతనాలు కోల్పోవాల్సి వస్తుందని అన్నారు.

భాగ్యనగరానికి అతి సమీపంలో ఉన్న రంగారెడ్డి జిల్లా దినదిన అభివృద్ధి చెందుతూ ముందుకు పోతున్న ఈ ప్రాంతంలో ఈఎస్ఐ మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి లేకపోవడం బాధాకరమని ఆయన అన్నారు.

ఈఎస్ఐ ఆసుపత్రిని మంజూరు చేసే వరకు కార్మికుల తరపున ఏఐపియుసి పోరాటం నిర్వహిస్తుందని అన్ని కార్మిక సంఘాలను కలుపుకొని భవిష్యత్తులో ఈఎస్ఐ హాస్పిటల్ కోసం ఉద్యమం నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

జిల్లా ప్రధాన కార్యదర్శి దత్తు నాయకం మాట్లాడుతూ ఇదివరకే అనేక దఫాలుగా ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణం కోసం జిల్లా కలెక్టర్ ను ఇతర ఉన్నతాధికారులను కలిసి వేడుకున్న పట్టించుకోకపోవడం బాధాకరమని ఆయన ఆవేదన చెందారు. కార్మికుల శ్రమశక్తితో ఉత్పత్తి ద్వారా ప్రభుత్వాలకు లక్షల కోట్ల ఆదాయం వస్తున్నప్పటికీ కార్మికుల మెరుగైన వైద్యం కోసం ఆసుపత్రిని మంజూరు చేయకపోవడం బాధాకరమని ఆయన ఆవేదన చెందారు

మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని మంజూరు చేయకపోతే జిల్లావ్యాప్తంగా ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని ఆయన అధికారులను హెచ్చరించారు.



# పట్టభద్రుల ఓటే ప్రజాస్వామ్య బలం..

- **నమోదుకు శంకర్‌గౌడ్ పిలుపు**
- **25 మంది ప్రైవేటు ఉపాధ్యాయుల దరఖాస్తు**

**వనపర్తి,అక్టోబర్ 23 (ప్రజాక్షేత్రం):**

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సాహితీ కళావేదిక వనపర్తి జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ప్రైవేటు పాఠశాలల్లో పనిచేస్తున్న 25 మంది ఉపాధ్యాయులు శుక్రవారం ఆన్‌లైన్‌లో పట్టభద్రుల ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకున్నారు.

ఈ సందర్భంగా శంకర్‌గౌడ్ మాట్లాడుతూ 2026 నవంబరు 1 నాటికి డిగ్రీ లేదా ఆపై విద్యను పూర్తి చేసి మూడేళ్లు నిండిన అర్హులు ఫారం18 ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తుకు డిగ్రీ ధ్రువపత్రం, ఆధార్ కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటో అవసరమని వివరించారు.

**నవంబరు 6 చివరి గడువు**

ఓటరు నమోదును ఆన్‌లైన్‌లో https://ceotserms2.telangana.gov.in/MLC/Form18.aspx ద్వారా లేదా ఆఫ్‌లైన్‌లో చేసుకోవచ్చని తెలిపారు. వనపర్తి జిల్లాలోని పట్టభద్రులు, ఉద్యోగులు, ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయులు వెంటనే తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. నవంబరు 6 చివరి తేదీ కావడంతో చివరి రోజు వరకు వేచి ఉండకుండా ముందుగానే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రతి పట్టభద్రుడి ఓటు ప్రజాస్వామ్య బలోపేతానికి, సమాజ అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు రాములు,ఉపాధ్యాయులను అభినందించారు.జిల్లా వ్యాప్తంగా ఓటరు నమోదుపై అవగాహన కార్యక్రమాలను కొనసాగిస్తామని శంకర్‌గౌడ్ తెలిపారు.



# మంబాపూర్‌లో ఆధ్యాత్మిక శోభ.. 50వ వారానికి హనుమాన్ చాలీసా పారాయణం

- **భక్తి మార్గంలో భక్తులను ఏకం చేస్తున్న సామూహిక పారాయణం**

**పెద్దేముల్,అక్టోబర్ 23 (ప్రజాక్షేత్రం):**

భక్తి భావనకు ప్రతీకగా, ఆధ్యాత్మిక చైతన్యానికి ఆలంబనగా, మనోధైర్యానికి ప్రేరణగా నిలిచే హనుమాన్ చాలీసా పారాయణం మంబాపూర్ గ్రామంలో 50వ వారానికి చేరుకోవడం విశేషం.శ్రీరామ నామస్మరణతో మనసును పవిత్రం చేసుకుంటూ, ఆంజనేయ స్వామి భక్తిలో ఆధ్యాత్మిక ఆనందాన్ని అనుభవించే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం భక్తులలో భక్తిభావాన్ని పెంపొందిస్తోంది.ఈ సందర్భంగా పెద్దేముల్ మండల పరిధిలోని మంబాపూర్ గ్రామంలో ఆదివారం, అక్టోబర్ 25న సాయంత్రం 6 గంటలకు ప్రత్యేక హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హనుమాన్ కథా వాచక్ అడికె కార్తీక్ పాల్గొననున్నారు.భక్తిశ్రద్ధలతో జరిగే ఈ పారాయణంలో శ్రీరాముడి మహిమను, హనుమంతుడి భక్తి తత్పరతను స్మరించుకుంటూ ఆధ్యాత్మిక సందేశాలను పంచుకోనున్నారు.

హనుమాన్ చాలీసా పారాయణం కేవలం శ్లోకాల పఠనమే కాకుండా మనసును ఏకాగ్రతతో నిలిపి, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకునే ఆధ్యాత్మిక సాధనగా భక్తులు భావిస్తారు. శ్రీరాముడిపై హనుమంతుడికి ఉన్న అచంచలమైన భక్తి, విధేయత, సేవాభావం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని, ఆ విలువలను జీవితంలో ఆచరించడం ద్వారా సమాజంలో సద్భావనను పెంపొందించవచ్చని నిర్వాహకులు పేర్కొంటున్నారు.నేటి ఆధునిక జీవనశైలిలో ఆధ్యాత్మిక చింతనకు సమయం కేటాయించడం, సత్ప్రవర్తనను అలవర్చుకోవడం, ధర్మబద్ధమైన జీవనాన్ని కొనసాగించడం ఎంతో ముఖ్యమనే సందేశాన్ని ఈ కార్యక్రమం అందిస్తోంది. సామూహిక పారాయణాల ద్వారా భక్తులు ఒకచోట చేరి ఆధ్యాత్మిక అనుభూతిని పంచుకోవడంతో పాటు, భక్తి సాంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేసే అవకాశం కలుగుతుంది.50వ వారపు హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమంలో హిందూ బంధువులు, ఆంజనేయస్వామి భక్తులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మంబాపూర్ గ్రామ ప్రజలు, హనుమాన్ చాలీసా పారాయణ సభ్యులు కోరారు. భక్తిశ్రద్ధలతో శ్రీరామ నామాన్ని స్మరిస్తూ, ఆంజనేయస్వామి ఆశీస్సులు పొందేందుకు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.



## సీజనల్ వ్యాధుల కట్టడికి ప్రత్యేక చర్యలు...

- **డ్రైడే కార్యక్రమాన్ని పర్యవేక్షించిన మున్సిపల్ కమిషనర్ బి నిరంజన్**

**వనపర్తి,అక్టోబరు 23 (ప్రజాక్షేత్రం):**

వనపర్తి పట్టణంలో సీజనల్ వ్యాధుల వ్యాప్తిని అరికట్టేందుకు చేపట్టిన పారిశుధ్య చర్యలను మున్సిపల్ కమిషనర్ బి నిరంజన్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహించిన డ్రైడే కార్యక్రమంలో భాగంగా 16వ వార్డుతోపాటు వివిధ వార్డుల్లో చేపట్టిన పనులను పరిశీలించారు. పారిశుధ్య నిర్వహణ, దోమల నివారణ చర్యలపై సిబ్బందికి సూచనలు చేశారు. పట్టణంలోని రోడ్లను శుభ్రం చేయడంతోపాటు మురికి కాలువల్లో పూడిక, పిచ్చిమొక్కలను తొలగించారు. మురుగునీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడి చల్లడంతోపాటు దోమల నివారణ మందును పిచికారీ చేశారు. సీజనల్ వ్యాధుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, శానిటరీ ఇన్స్పెక్టర్ఉమ మహేశ్వర్ రెడ్డి,మెప్మా అధికారులు,ఆర్పీలు,ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఏఎన్ఎంలు,ఆశా కార్యకర్తలు, వార్డు అధికారులు,మున్సిపల్ సిబ్బంది ,ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## భూ రీసర్వే, జనగణనపై కలెక్టర్ దిశానిర్దేశం

- **రైతులకు ముందస్తు సమాచారం..**
- **ప్రభుత్వ భూముల స్వాధీనానికి ఆదేశం**
- **విద్యార్థులతో కలిసి భోజనం చేసిన అదనపు కలెక్టర్**

**వనపర్తి,అక్టోబరు 23 (ప్రజాక్షేత్రం):**

భూ రీసర్వే పనులను నిర్దేశిత గడువు లోగా పారదర్శకంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. పట్టా భూముల సర్వేకు ముందు రైతులకు సమాచారం ఇవ్వాలని, ప్రభుత్వ భూములు ఆక్రమణలో ఉంటే నిబంధనల ప్రకారం స్వాధీనం చేసుకోవాలని సూచించారు. మరోవైపు జనగణన-2027లో ప్రతి వ్యక్తి, ప్రతి కుటుంబం వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలని స్పష్టం చేశారు.

**రీసర్వేలో తప్పులకు తావివ్వొద్దు**

వనపర్తి మండలం జక్కంపల్లి రెవెన్యూ పరిధిలో కొనసాగుతున్న భూ రీసర్వే పనులను శుక్రవారం కలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. భూముల సరిహద్దులను క్షేత్రస్థాయిలో కచ్చితంగా గుర్తించి, సర్వే వివరాలను రైతులకు తెలియజేయాలని సూచించారు. సర్వే పూర్తయిన అనంతరం రైతుల సంతకాలు తీసుకోవాలని, భూమి విస్తీర్ణం, హద్దుల నమోదులో పొరపాట్లు జరగకుండా చూడాలని ఆదేశించారు.

**జనగణన పక్కాగా నిర్వహించాలి**

జనగణన-2027లో భాగంగా జనాభా గణన నిర్వహణపై ఐడీఓసీ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ ఆదర్శ్ సురభి హాజరయ్యారు. ఏ ఒక్క వ్యక్తి, కుటుంబం గణన నుంచి తప్పిపోకూడదని, ఒకరి వివరాలు రెండుసార్లు నమోదు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులను నిబంధనల ప్రకారం వారు వాస్తవంగా నివసిస్తున్న చోటే నమోదు చేయాలన్నారు. క్షేత్రస్థాయి సిబ్బందికి పూర్తిస్థాయి శిక్షణ ఇచ్చి, జనాభా వివరాలను కచ్చితంగా సేకరించాలని ఆదేశించారు.

**వసతిగృహాలు, కళాశాలల్లో తనిఖీలు**

గోపాల్‌పేట మండలం చెన్నూరు గ్రామంలో జరుగుతున్న భూ రీసర్వే పనులను అదనపు కలెక్టర్ వినోద్ కుమార్ పరిశీలించారు. సరిహద్దుల గుర్తింపు, భూముల వివరాల నమోదు, రికార్డుల నిర్వహణలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సర్వే సిబ్బందికి సూచించారు.

అనంతరం కేడీఆర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలోని ప్రభుత్వ బీసీ బాలుర వసతిగృహాన్ని సందర్శించి గదులు, వంటగది, భోజన నాణ్యత, మౌలిక వసతులను తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. చేతులు కడుక్కునే ప్రాంతంలో పారిశుద్ధ్యం మెరుగుపరచాలని, డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

తదుపరి ఎంజేపీటీబీసీ వ్యవసాయ డిగ్రీ కళాశాలను సందర్శించి విద్యాబోధన, విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి పరీక్షల సన్నద్ధత, భవిష్యత్తు లక్ష్యాల గురించి తెలుసుకున్నారు. నాణ్యమైన విద్యతోపాటు పౌష్టికాహారం, పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని కళాశాల యాజమాన్యానికి సూచించారు.

ఈ కార్యక్రమాల్లో సర్వే ఏడీ శ్రీనివాసులు,జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి యాదయ్య,ముఖ్య ప్రణాళిక అధికారి హరికృష్ణ,డిప్యూటీ సీఈవో రామ మహేశ్వర్, మాస్టర్ ట్రైనర్లు,రెవెన్యూ అధికారులు,వసతిగృహ సంక్షేమాధికారులు,కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.




## విద్యార్థినికి భరోసా..

- **రైతులకు అండగా నిరంజన్‌రెడ్డి**

**వనపర్తి,అక్టోబర్ 23 (ప్రజాక్షేత్రం):**



హైదరాబాద్‌లోని ఎంవీఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన దుర్ఘటనలో తీవ్రంగా గాయపడి యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వనపర్తికి చెందిన విద్యార్థిని మీనాను మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి విద్యార్థినికి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. మీనా త్వరగా కోలుకుంటుందని, అధైర్యపడకుండా ఆత్మస్థైర్యంతో ఉండాలని ధైర్యం చెప్పారు. ఆమె తల్లిదండ్రులు నారాయణదాస్, అశోక్‌చారి దంపతులను పరామర్శించి, అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

మరోవైపు పెద్దమందడి మండలం అల్వాల గ్రామంలో కరెంటు కోతలతో నీరందక ఎండిపోయిన వరి పంటలను నిరంజన్‌రెడ్డి రైతులతో కలిసి పరిశీలించారు. బుద్దారం రిజర్వాయర్ ఎడమ కాలువ ద్వారా చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల నీటి లభ్యత ఉన్నప్పటికీ విద్యుత్తు కోతల కారణంగా సుమారు 200 ఎకరాల్లో వానాకాలం వరి పంటలు ఎండిపోయాయని ఆరోపించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి నిరంతర విద్యుత్తు సరఫరాతోపాటు సాగునీరు అందించి మిగిలిన పంటలను కాపాడాలని కోరారు. దీనివల్ల బోరుబావుల్లో భూగర్భ జలాలు పెరిగి యాసంగి పంటలకు, పశువుల అవసరాలకు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఎండిన పంటలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టాన్ని అంచనా వేసి రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాల్లో జగదీశ్వర్‌రెడ్డి, రఘుపతిరెడ్డి,సర్పంచి రాజవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.






## గ్రామీణ ప్రాంత ప్రజలకు చేరువైన బ్యాంకింగ్ సేవలు

- **అడికిచర్లలో ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్ కార్యక్రమం**
- **అడికిచర్ల సర్పంచ్ మ్యాతరి యశోద, ఉపసర్పంచ్ ఎల్లప్పల సమక్షంలో ప్రజలకు బ్యాంకింగ్ సేవలపై అవగాహన కార్యక్రమాలు**
- **కేవైసీ, బీమా పథకాలు, ఆధార్ సీడింగ్, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన**
- **కేవైసీ, రీ-కేవైసీతో ఖాతాల నవీకరణ**
- **బీమా, పెన్షన్ పథకాలపై అవగాహన**
- **ఆధార్ సీడింగ్‌పై అధికారుల సూచనలు**
- **సైబర్ మోసాల నివారణకు అప్రమత్తత అవసరం**
- **ఎస్‌బీఐ లీడ్ బ్యాంక్ మేనేజర్ డేవిడ్ విల్సన్**

**పెద్దేముల్,అక్టోబర్ 23 (ప్రజాక్షేత్రం):**

గ్రామీణ ప్రజలకు బ్యాంకింగ్ సేవలను మరింత చేరువ చేయడంతోపాటు, ప్రభుత్వ ఆర్థిక పథకాలపై అవగాహన కల్పించి ప్రతి ఒక్కరినీ ఆర్థిక భద్రత వైపు నడిపించడమే లక్ష్యంగా ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్ (ఆర్థిక సమ్మిళితత్వం) కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్దేముల్ మండల పరిధిలోని అడికిచర్ల గ్రామంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా బ్యాంకు ఖాతాదారులకు కేవైసీ, రీకేవైసీ ప్రక్రియలను చేపట్టడంతోపాటు వివిధ బీమా పథకాలు, ఆధార్ సీడింగ్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఎస్‌బీఐ లీడ్ బ్యాంక్ మేనేజర్ డేవిడ్ విల్సన్ అడికిచర్ల గ్రామ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ బ్యాంకు ఖాతాల నిర్వహణ, ఖాతాదారుల వివరాల నవీకరణ, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను పొందేందుకు అవసరమైన ప్రక్రియల గురించి ప్రజలకు వివరిస్తున్నామని అన్నారు.బ్యాంకింగ్ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, ఆర్థిక లావాదేవీల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.బ్యాంకు ఖాతాదారుల గుర్తింపును ధ్రువీకరించేందుకు కేవైసీ (నో యువర్ కస్టమర్ ), అవసరమైన ఖాతాలకు రీకేవైసీ ప్రక్రియలు ఎంతో కీలకమని వివరించారు.ఖాతాదారులు తమ పేరు, చిరునామా, గుర్తింపు పత్రాలు తదితర వివరాల్లో మార్పులు ఉంటే బ్యాంకు నిబంధనల ప్రకారం వాటిని నవీకరించుకోవాలని సూచించారు.ఖాతా వివరాలు సక్రమంగా ఉండటం వల్ల బ్యాంకింగ్ సేవలను నిరంతరాయంగా పొందేందుకు, అవసరమైన లావాదేవీలను సులభంగా నిర్వహించేందుకు అవకాశం ఉంటుందని వివరించారు.కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన (పీఎంఎస్బివై ), ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (పీఎంజేజేబీవై ), అటల్ పెన్షన్ యోజన (ఏపీవై) పథకాల ప్రాధాన్యతను ప్రజలు తెలుసుకోవాలని,ప్రమాద బీమా, జీవిత బీమా, వృద్ధాప్యంలో పెన్షన్ భద్రత వంటి అంశాలపై అవగాహన కలిగివుండాలని కోరారు.పీఎంఎస్బివై పథకం ప్రమాదవశాత్తు మరణం లేదా అంగవైకల్యానికి సంబంధించిన బీమా రక్షణను అందించేందుకు ఉద్దేశించబడిందని,పీఎంజేజేబీవై పథకం అర్హులైన చందాదారులకు జీవిత బీమా రక్షణ కల్పిస్తుందని,ఏపీవై పథకం నిబంధనలకు అనుగుణంగా చందాలు చెల్లించే అర్హులైన చందాదారులకు 60 ఏళ్ల వయస్సు నుంచి హామీతో కూడిన కనీస నెలవారీ పెన్షన్ అందించే లక్ష్యంతో అమలవుతోందని అన్నారు.ఈ పథకాలకు సంబంధించిన అర్హతలు, ప్రీమియం లేదా చందా వివరాలు, ప్రయోజనాలను తెలుసుకొని తమ అవసరాలకు అనుగుణంగా నిర్ణయం తీసుకోవాలని సూచించారు.బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం (ఆధార్ సీడింగ్) ప్రాధాన్యతను కూడా వివరించారు.ప్రభుత్వ ప్రయోజనాలు నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమయ్యే పథకాల విషయంలో, సంబంధిత పథకం నిబంధనల ప్రకారం ఆధార్ అనుసంధానం అవసరమయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఖాతాదారులు తమ ఆధార్ వివరాలు, బ్యాంకు ఖాతా వివరాలను సరిచూసుకోవాలని, ఏవైనా సమస్యలు ఉంటే సంబంధిత బ్యాంకును సంప్రదించాలని సూచించారు.ప్రస్తుత డిజిటల్ బ్యాంకింగ్ యుగంలో సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.గుర్తుతెలియని వ్యక్తులకు ఓటీపీ, ఏటీఎం పిన్, యూపీఐ పిన్, బ్యాంకు ఖాతా వివరాలు వెల్లడించరాదని సూచించారు.అనుమానాస్పద లింకులను క్లిక్ చేయడం, తెలియని వ్యక్తులు పంపే యాప్‌లను ఇన్‌స్టాల్ చేయడం, ఫోన్ ద్వారా వచ్చే నకిలీ బ్యాంకు కాల్స్‌ను నమ్మడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని వివరించారు. బ్యాంకు అధికారులు ఎవరూ ఓటీపీ, పిన్ వంటి రహస్య వివరాలను అడగరనే విషయాన్ని గుర్తుంచుకోవాలని తెలిపారు. సైబర్ మోసానికి గురైనట్లయితే ఆలస్యం చేయకుండా 1930 జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని, cybercrime.gov.in వెబ్‌సైట్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మ్యాతరి యశోద, ఉప సర్పంచ్ ఎల్లప్ప, అడికిచర్ల గ్రామ పంచాయతీ కార్యదర్శి మొగులప్ప,పెద్దేముల్ మండల ఎంపీడీఓ కే.తిరుమల స్వామి, ఎస్‌బీఐ లీడ్ బ్యాంక్ మేనేజర్ డేవిడ్ విల్సన్,ఎస్‌బీఐ బిజినెస్ కరస్పాండెంట్ (బీసీ) వనిత, సీఎఫ్ఎల్ కౌన్సిలర్లు యు.రాజేష్,కె.రాజు, జి.సంతోష్ కుమార్‌తో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికలు.. కాంగ్రెస్‌కు ప్రజాతీర్పు పరీక్ష!

- **అధికారమే బలమా? ప్రజాభిమానమే విజయమా?**
- **మిత్రపక్షాల అసంతృప్తి.. బీసీల ఆవేదన.. ఉద్యోగుల ఆగ్రహం.. అభ్యర్థుల గెలుపునకు అసలైన సవాలు!**
- **అభ్యర్థుల ఎంపికలోనే తప్పటడుగులా?**

**వికారాబాద్ బ్యూరో,అక్టోబర్ 23 (ప్రజాక్షేత్రం):**



ఎన్నికల్లో విజయం సాధించాలంటే కేవలం అభ్యర్థులను ప్రకటిస్తే సరిపోదు. పార్టీ శ్రేణుల సమన్వయం, మిత్రపక్షాల సహకారం, సామాజిక వర్గాల విశ్వాసం, ప్రజా సమస్యలపై స్పష్టమైన వైఖరి అవసరం. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఎదుర్కొంటున్న సవాళ్లు ఇదే విషయాన్ని గుర్తు చేస్తున్నాయి. అభ్యర్థుల ఎంపికపై అసంతృప్తి వ్యక్తమవుతున్నదన్న ప్రచారం, మిత్రపక్షాల మద్దతుపై అనిశ్చితి, ఉద్యోగులు-ఉపాధ్యాయుల్లో నెలకొన్న అసహనం.. ఇవన్నీ అధికార పార్టీ ఎన్నికల వ్యూహానికి పరీక్షగా మారే అవకాశం ఉంది.

**మిత్రపక్షాలను విస్మరిస్తే రాజకీయంగా మూల్యం తప్పదు!**

రాజకీయాల్లో పొత్తులు కేవలం ఎన్నికల నాటి ఒప్పందాలు కావు. పరస్పర గౌరవం, సంప్రదింపులు, భాగస్వామ్య నిర్ణయాలపై అవి నిలబడాలి. తెలంగాణ జన సమితి, వామపక్ష పార్టీల వంటి మిత్రపక్షాలతో సమన్వయం లేకుండా నిర్ణయాలు తీసుకున్నారనే విమర్శలు నిజమైతే, అది కాంగ్రెస్ నాయకత్వం పునరాలోచించాల్సిన అంశం. మిత్రపక్షాల మద్దతు కోరే ముందు వాటి అభిప్రాయాలకు విలువ ఇవ్వాలి. ఎన్నికల సమయంలో మాత్రమే మిత్రులను గుర్తుచేసుకోవడం కూటమి రాజకీయాలకు బలం చేకూర్చదు.

**బీసీలకు ప్రాతినిధ్యం.. మాటల్లో కాదు, చేతల్లో చూపాలి!**

సామాజిక న్యాయం అనేది ఎన్నికల ప్రచారానికి పరిమితమైన నినాదం కాకూడదు. రాజకీయ ప్రాతినిధ్యం, అవకాశాల పంపిణీ, నిర్ణయాధికారంలో భాగస్వామ్యం వంటి అంశాల్లో అన్ని వర్గాలకు న్యాయం జరగాలి. అభ్యర్థుల ఎంపికలో కొన్ని సామాజిక వర్గాలకే ప్రాధాన్యం లభిస్తున్నదనే భావన ఏర్పడితే, అది అసంతృప్తికి దారితీయవచ్చు. బీసీల ఆకాంక్షలను విస్మరించి వారి మద్దతును ఆశించడం రాజకీయంగా సరైన వ్యూహం కాదు. అయితే ఏ వర్గం ఓటర్లు ఒకే విధంగా ఆలోచిస్తారని భావించకుండా, వారి సమస్యలను వాస్తవికంగా అర్థం చేసుకోవాలి.

**ఉద్యోగులు, ఉపాధ్యాయుల సహనానికి పరీక్ష పెట్టొద్దు!**

పీఆర్సీ అమలు, పెండింగ్ డీఏలు, ఉద్యోగుల ఇతర సమస్యలపై స్పష్టత కోసం ఎదురుచూస్తున్న వర్గాలకు హామీల కంటే పరిష్కారాలే ముఖ్యం. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాలనలో కీలక భాగస్వాములు. వారి సమస్యలను వాయిదా వేస్తూ ఎన్నికల సమయంలో మద్దతు కోరడం విశ్వాసాన్ని దెబ్బతీస్తుంది. ప్రభుత్వం తన నిర్ణయాలపై స్పష్టమైన వివరణ ఇవ్వాలి. సాధ్యమైన సమస్యలకు గడువులతో కూడిన పరిష్కార ప్రణాళిక ప్రకటించాలి. ఉద్యోగుల ఆందోళనలను రాజకీయ వ్యతిరేకతగా మాత్రమే చూడకుండా, పాలనలోని లోపాలను సరిదిద్దుకునే అవకాశంగా తీసుకోవాలి.

**పీఆర్టీయూ పోటీ.. ఓట్ల లెక్కలకు కొత్త సవాలు!**

ఉపాధ్యాయ సంఘం నుంచి అభ్యర్థి పోటీలో నిలవడం ఎన్నికల సమీకరణాలను ప్రభావితం చేసే అంశం కావచ్చు. అయితే సంఘం సభ్యత్వం ఎక్కువగా ఉందని, ఆ ఓట్లన్నీ ఒకే అభ్యర్థికి పడతాయని ముందుగానే నిర్ణయించడం పొరపాటు. అభ్యర్థి విశ్వసనీయత, ఉపాధ్యాయుల సమస్యలపై ఆయన వైఖరి, ప్రచార బలం, ఓటర్లతో సంబంధాలు ఫలితాలను ప్రభావితం చేస్తాయి. బీజేపీతో పరస్పర సహకారంపై ప్రచారం జరుగుతున్నప్పటికీ, అధికారిక నిర్ధారణ లేకుండా దానిని ఖరారైన ఒప్పందంగా పరిగణించలేం. రాజకీయ అంచనాలకంటే ఓటర్ల వాస్తవ స్పందనే కీలకం.

**అధికార పార్టీకి ఆత్మపరిశీలన అవసరం!**

ప్రజలు ఇచ్చిన అధికారాన్ని ప్రజల సమస్యలకు పరిష్కారాలు చూపించేందుకు వినియోగించాలి. పార్టీ అంతర్గత విభేదాలు, నాయకుల మధ్య ఆధిపత్య పోరు, మిత్రపక్షాలతో విభేదాలు ఎన్నికల సమయంలో బయటపడితే, కార్యకర్తల్లో గందరగోళం ఏర్పడుతుంది. అభ్యర్థులకు పూర్తి సహకారం అందేలా నాయకత్వం సమన్వయం చేయాలి. అదే సమయంలో అభ్యర్థులు తమ వ్యక్తిగత పరిచయాలపైనే ఆధారపడకుండా పట్టభద్రుల సమస్యలు, విద్యా రంగం, ఉపాధి అవకాశాలు, ప్రభుత్వ విధానాలపై స్పష్టమైన కార్యాచరణతో ప్రజల్లోకి వెళ్లాలి.

**గెలుపు కోసం లెక్కలు కాదు.. విశ్వాసం కావాలి!**

ఎమ్మెల్సీ ఎన్నికలు కేవలం పార్టీల బలాబలాలను కొలిచే పోటీ కాదు. ప్రజాప్రతినిధులు తమ బాధ్యతలను ఎంతవరకు నిర్వర్తిస్తున్నారు? ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పట్టభద్రుల సమస్యలకు ఎంత ప్రాధాన్యం ఇస్తున్నారు? సామాజిక న్యాయం పట్ల ఎంత నిబద్ధత చూపుతున్నారు? అన్న ప్రశ్నలకు కూడా ఇవి పరీక్షగా నిలుస్తాయి. అభ్యర్థుల ఎంపికలో జరిగిన తప్పులను సరిదిద్దుకోవడం, మిత్రపక్షాలతో గౌరవప్రదమైన చర్చలు జరపడం, ఉద్యోగుల సమస్యలపై కార్యాచరణ ప్రకటించడం కాంగ్రెస్ ముందున్న ముఖ్యమైన బాధ్యతలు.

ప్రజాస్వామ్యంలో అధికారం శాశ్వతం కాదు. ప్రజల విశ్వాసమే రాజకీయ పార్టీలకు అసలైన బలం. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం చేసే ప్రయత్నాలకంటే, ఎన్నికలకు ముందూ తర్వాతా ప్రజల పక్షాన నిలబడటమే నాయకత్వానికి నిజమైన కొలమానం. కాంగ్రెస్ ఈ సవాళ్లను ఆత్మపరిశీలనకు అవకాశంగా తీసుకుంటుందా? లేక రాజకీయ లెక్కలకే పరిమితమవుతుందా? అన్నది రాబోయే పరిణామాలు తేల్చనున్నాయి.

## శ్రీశైలం మల్లన్న ఆలయానికి స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ వర్తింపు

**నంద్యాల,అక్టోబర్ 23 (ప్రజాక్షేత్రం):**

నంద్యాల జిల్లా శ్రీశైలం మల్లన్న ఆలయానికి స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ వర్తింపు ఎన్నికల కోడ్ కారణంగా రాష్ట్రంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) అమలులో ఉన్నందువలన శ్రీశైలం దేవస్థానంలో వసతి ఏర్పాట్లు,శ్రీస్వామి అమ్మవారి దర్శనానికి సంబంధించి ఎలాంటి సిఫారసు లేఖలు స్వీకరించబడవని ఈఓ శ్రీనివాసరావు ప్రకటనలో తెలియజేసారు ప్రోటోకాల్ పరిధిలోని ప్రముఖులు శ్రీశైలానికి స్వయంగా వచ్చినప్పుడు మాత్రమే వారికి తగినరీతిలో వసతి,దర్శనం ఏర్పాట్లు కల్పిస్తామని అలానే రాష్ట్రంలో ఎన్నికల నియమావళి అమలులో ఉన్నంత వరకు ఈ విధానం కొనసాగుతుందని శ్రీశైలం సిఫార్స్ లేఖలతో వచ్చే భక్తులందరు ఈ విషయాన్ని గమనించి దేవస్థానానికి సహకరించవలని ఈఓ శ్రీనివాసరావు ప్రకటన ద్వారా మీడియాకు తెలిపారు.



## నంద్యాల జిల్లాలో ప్రశాంతంగా, పారదర్శకంగా జెడ్పీటీసీ, ఎంపీటీసీ నామినేషన్ల స్వీకరణ

**నంద్యాల,అక్టోబర్ 23 (ప్రజాక్షేత్రం):**

నంద్యాల జిల్లా వ్యాప్తంగా మొత్తం 28 మండలాల్లో జెడ్పీటీసీ ( జడ్పిటిసి), ఎంపీటీసీ ( ఎంపీటీసీ ) స్థానాలకు సంబంధించిన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా కొనసాగుతోంది. అన్ని నామినేషన్ కేంద్రాల్లో ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత వాతావరణంలో నామినేషన్ల స్వీకరణ జరిగినట్లు తెలిపారు

అన్ని రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం అభ్యర్థులను నామినేషన్ కేంద్రాల్లోకి అనుమతించి, టోకెన్లు జారీ చేస్తూ నామినేషన్ల ప్రక్రియను పూర్తి చేయిస్తున్నారు. అభ్యర్థులకు ఎక్కడైనా ఇబ్బందులు లేదా ఆటంకాలు ఎదురైతే, సంబంధిత నామినేషన్ కేంద్రంలోని పోలీసులను నేరుగా సంప్రదించాలని సూచించారు. అభ్యర్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నామినేషన్లు దాఖలు చేసేందుకు పోలీసులు పూర్తి సహకారం అందిస్తారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా పోలీసు శాఖ పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టిందని జిల్లా ఎస్పీ మీడియాకు వివరించడం జరిగింది.



# విజయదశమి సందర్భంగా రెవిన్యూ శాఖ మంత్రిని కలిసిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**శంషాబాద్,అక్టోబర్ 23 (ప్రజాక్షేత్రం):** విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని, శుక్రవారం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ,రాష్ట్ర రెవిన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి కి విజయదశమి శుభాకాంక్షలు తెలియజేసి,కాసేపు పలు అభివృద్ధి అంశాలపై చర్చించారు.





# చెంగోల్ పాఠశాలల అభివృద్ధికి రూ.9 లక్షల నిధులు మంజూరు.

- **కాంపౌండ్ వాల్ నిర్మాణం.**
- **మరమ్మతు పనులకు శ్రీకారం.**

**తాండూర్,అక్టోబర్ 23(ప్రజాక్షేత్రం):** తాండూరు మండలం చెంగోల్, గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం రూ.9 లక్షల నిధులు మంజూరు చేసింది. ఇందులో యూపీఎస్ పాఠశాల కాంపౌండ్ వాల్ నిర్మాణానికి రూ.7 లక్షలు, జెడ్పీహెచ్ఎస్ హైస్కూల్ కాంపౌండ్ వాల్ మరమ్మతులకు రూ.2 లక్షలు కేటాయించారు. శుక్రవారం గ్రామ సర్పంచ్ నర్సమ్మ ఈ పనులను ప్రారంభించారు. నిధుల మంజూరుకు సహకరించిన తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డికి గ్రామ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అనిత,వార్డు సభ్యులు గోపాల్, రాములు,పంచాయతీ కార్యదర్శి అశోక్ కుమార్,పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కిష్టప్పతో పాటు ఎల్లమ్మ, వెంకటేష్,విజయ్,మంజుల, నాగేశం,యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# దళితుల స్మశాన వాటిక భూమిపై కన్నేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు!

- **చెట్లు నాటే పేరుతో స్మశాన వాటిక భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నమా?**



**మహేశ్వరం అక్టోబర్ 23 (ప్రజాక్షత్రం):** మహేశ్వరం నియోజకవర్గం పరిధి మహేశ్వరం మండలం దుబ్బచెర్ల గ్రామం
సర్వేనెంబర్.81 గ్రామంలోని ఎస్సీ ( ఎస్సీ ) సామాజిక వర్గానికి చెందిన ప్రజల స్మశాన వాటిక భూమిపై పక్కనే ఉన్న వెంచర్ నిర్వాహకులు కన్నేయడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.
స్మశాన వాటికకు ఆనుకొని ఉన్న వెంచర్ నిర్వాహకులు చెట్లు నాటే పేరుతో పెద్ద ఎత్తున గుంతలు తవ్వడం అనేక అనుమానాలకు తావిస్తోంది.
చెట్లు నాటాలంటే వారి వెంచర్ భూమిలో నాటుకోవచ్చు. కానీ దళితుల స్మశాన వాటిక భూమిలోనే గుంతలు తవ్వాల్సిన అవసరం ఏమొచ్చింది?
ఇది కేవలం చెట్లు నాటే కార్యక్రమమా? లేక భవిష్యత్తులో స్మశాన వాటిక భూమిని తమ ఆధీనంలోకి తీసుకునేందుకు చేస్తున్న ప్రయత్నమా? అనే అనుమానాలు గ్రామ ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.
స్మశాన వాటిక అనేది కేవలం ఖాళీ స్థలం కాదు. తరతరాలుగా మా సామాజిక వర్గ ప్రజల అంత్యక్రియల కోసం ఉపయోగపడే అత్యంత ముఖ్యమైన ప్రదేశం.
అలాంటి భూమిపై ఎవరు ఆక్రమణకు ప్రయత్నించినా సహించేది లేదు.
మా డిమాండ్లు:
1. రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి స్మశాన వాటిక భూమిని సర్వే చేయాలి.
2. స్మశాన వాటిక హద్దులను అధికారికంగా గుర్తించి హద్దురాళ్లు ఏర్పాటు చేయాలి.
3. అనుమతులు లేకుండా గుంతలు తవ్వినట్లు తేలితే సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.
4. స్మశాన వాటిక భూమి ఆక్రమణకు గురికాకుండా శాశ్వత రక్షణ చర్యలు చేపట్టాలి.
5. ఈ వ్యవహారంపై గ్రామ పంచాయతీ, రెవెన్యూ అధికారులు సమగ్ర విచారణ జరపాలి. సంబంధిత అధికారులు వెంటనే స్పందించాలి.
దళితుల స్మశాన వాటిక భూమిని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానికి, స్థానిక అధికారులకు ఉంది.
మా హక్కులను కాపాడుకోవడానికి చట్టబద్ధంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాడతాం.
బతికున్నప్పుడు గౌరవంగా జీవించే హక్కు మాది.
మరణించిన తర్వాత గౌరవంగా అంత్యక్రియలు జరుపుకునే హక్కు కూడా మాదే.
స్మశాన వాటిక భూమిని. దళితుల భూమిని కాపాడలని. (మహేశ్వరం మండల ఎమ్మార్వో చిన్న అప్పలనాయుడు కి వినతి పత్రం అందజేసిన దుబ్బచెర్ల గ్రామస్తులు) ఈ కార్యక్రమంలో ఎర్ర కృష్ణ. పుట్టగల్ల అశోక్. పుట్టగల్ల దేవేందర్. నడ్డి నరసింహ. ఎర్ర రాజు. నడ్డి నరేష్. శ్రీకాంత్ పాల్గొన్నారు



# బెల్టు షాపులపై నిఘా ఏది? మత్తులో ఎక్సైజ్ శాఖ?

- **బెల్టు షాపులపై బండ రావిరాల గ్రామసభ కన్నెర్ర**
- **తెల్లవారుజామునే మద్యం విక్రయాలా? మహిళల ఆవేదన**
- **ఇన్స్పెక్టర్ సిహెచ్. రాజుకు బండ రావిరాల సర్పంచ్ విజయ్ కుమార్ ఫిర్యాదు**

**రంగారెడ్డి జిల్లా,అక్టోబర్ 23 (ప్రజాక్షేత్రం):** గ్రామాల్లో బెల్ట్ షాపుల ద్వారా సాగుతున్న మద్యం విక్రయాలు ప్రజల జీవితాలను చిన్నాభిన్నం చేస్తున్నాయనే ఆందోళనలు మహిళల్లో వ్యక్తమవుతున్నాయి. ఓవైపు మద్యం నియంత్రణ, ప్రజల ఆరోగ్య పరిరక్షణపై ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నామని చెబుతుండగా,మరోవైపు గ్రామాల్లో తెల్లవారుజామునే మద్యం విక్రయాలు జరుగుతున్నాయనే ఆరోపణలు రావడం చర్చనీయాంశంగా మారింది. ఇలాంటి విక్రయాలను అరికట్టాల్సిన ఎక్సైజ్ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారనే ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.

**బెల్ట్ షాపులపై గ్రామసభలో ఆగ్రహం**

రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్టు మండలం పరిధిలోని బండరావిరాల గ్రామంలో తెల్లవారుజామున ఐదు గంటల నుంచే బెల్ట్ షాపుల ద్వారా మద్యం విక్రయిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.వీటి కారణంగా అనేక కుటుంబాలు ఆరోగ్యపరంగా,ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని గ్రామసభలో మహిళలు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. మద్యానికి అలవాటుపడిన కొందరు కుటుంబ బాధ్యతలను విస్మరిస్తుండటంతో భార్యాపిల్లలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కుటుంబ ఆదాయంలో కొంత భాగం మద్యానికే ఖర్చవుతుండటంతో నిత్యావసరాలు, పిల్లల చదువులు, వైద్య ఖర్చులకు డబ్బులు సరిపోని పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

**మహిళల కన్నీళ్లకు బాధ్యులెవరు?**

మద్యం సేవించి ఇంటికి వచ్చే కొందరి వల్ల కుటుంబాల్లో గొడవలు, ఆర్థిక ఇబ్బందులు, మానసిక ఒత్తిడి పెరుగుతున్నాయని మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మద్యపానానికి బానిసలైన వ్యక్తుల ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు వారి కుటుంబ సభ్యుల జీవన ప్రమాణాలు కూడా పడిపోతున్నాయి. ముఖ్యంగా యువత మద్యానికి ఆకర్షితులు కావడం భవిష్యత్తుపై ప్రభావం చూపే ప్రమాదం ఉందని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ఇలాంటి పరిస్థితులకు కారణమవుతున్న అక్రమ మద్యం విక్రయాలపై సంబంధిత శాఖలు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని కోరుతున్నారు.

**మత్తులో ఎక్సైజ్ శాఖ?**

బెల్ట్ షాపుల ద్వారా మద్యం విక్రయాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నప్పుడు వాటిపై నిఘా పెట్టాల్సిన ఎక్సైజ్ శాఖ ఏం చేస్తోందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. తెల్లవారుజామునే మద్యం అందుబాటులోకి వస్తుంటే విక్రయాల మూలాలను గుర్తించి అరికట్టడంలో సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో వెల్లడించాల్సిన అవసరం ఉంది. గ్రామాల్లో అక్రమ మద్యం విక్రయాలపై ఫిర్యాదులు వస్తే తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. అయితే, బండరావిరాల గ్రామంలో ఎక్సైజ్ శాఖ నిర్లక్ష్యం వహించిందనే విషయం అధికారికంగా నిర్ధారణ కాలేదు.ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు స్పందించి వాస్తవ పరిస్థితులను పరిశీలించి,అవసరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



**సీఐకి సర్పంచ్ ఫిర్యాదు..**

**బెల్ట్ షాపుల మూసివేతకు తీర్మానం**

గ్రామంలో బెల్ట్ షాపుల సమస్యపై సమగ్రంగా చర్చించిన గ్రామసభ వాటి మూసివేతకు తీర్మానం చేసింది.ఈ మేరకు గ్రామ సర్పంచ్ కందికంటి విజయ్‌కుమార్, పాలకవర్గ సభ్యులు అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.రాజును కలిసి ఫిర్యాదు చేశారు. గ్రామ సభ తీర్మాన ప్రతులు, నోటీసులను అందజేసి, అక్రమ మద్యం విక్రయాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.గ్రామంలో శాంతిభద్రతలను పరిరక్షించడం, మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తగ్గించడం, మద్యం దుష్ప్రభావాల నుంచి యువతను కాపాడటం, కుటుంబాలు ఆర్థికంగా నష్టపోకుండా చూడటమే తమ లక్ష్యమని సర్పంచ్ కందికంటి విజయ్‌కుమార్ తెలిపారు. సంబంధిత పోలీసు, ఎక్సైజ్ శాఖ అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకుని బెల్ట్ షాపుల సమస్యకు పరిష్కారం చూపాలని గ్రామస్థులు కోరుతున్నారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ దూస శంకర్,వార్డు సభ్యులు ఏర్పుల హరికృష్ణ, గుండ్ల భవాని శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ రంగంలో విశేష సేవలకు గుర్తింపు!

- **గాదె నర్సిరెడ్డికి ఉత్తమ రైతు అవార్డు**
- **మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా పురస్కారం అందుకున్న మొరంపల్లి బంజర రైతు**

**బూర్గంపహాడ్,అక్టోబర్ 23 (ప్రజాక్షేత్రం):** వ్యవసాయ రంగంలో విశేష సేవలు అందిస్తూ ,తోటి రైతులకు ఆదర్శంగా నిలుస్తున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మండలం మొరంపల్లి బంజర గ్రామానికి చెందిన ఉత్తమ రైతు గాదె నర్సిరెడ్డికి అరుదైన గౌరవం దక్కింది.వ్యవసాయ రంగంలో ఆయన అందిస్తున్న సేవలను గుర్తించిన కృషి విజ్ఞాన కేంద్రం, భద్రాద్రి కొత్తగూడెం ఆధ్వర్యంలో 2025 కిసాన్ దివస్ సందర్భంగా ఆయనను ఉత్తమ రైతు అవార్డుకు ఎంపిక చేసి ఘనంగా సత్కరించారు.తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా గాదె నర్సిరెడ్డి ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని అందుకోవడం విశేషం.

**రైతు కష్టానికి దక్కిన సముచిత గౌరవం**

వ్యవసాయం కేవలం ఒక వృత్తి మాత్రమే కాదు.. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక, కోట్లాది ప్రజల జీవనాధారం. రైతు చెమటోడ్చి పండించే పంటలే సమాజానికి అన్నం పెడుతున్నాయి.అలాంటి వ్యవసాయ రంగంలో అంకితభావంతో పనిచేస్తూ, తన అనుభవాన్ని ఇతర రైతులకు ఉపయోగపడేలా అందిస్తున్న గాదె నర్సిరెడ్డికి ఉత్తమ రైతు అవార్డు లభించడం ఆయన కృషికి దక్కిన సముచిత గౌరవంగా నిలిచింది.

**తోటి రైతులకు స్ఫూర్తిగా గాదె నర్సిరెడ్డి**

వ్యవసాయ రంగంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, సాగులో ఎదురయ్యే సవాళ్లు, పంటల నిర్వహణ వంటి అంశాల్లో రైతులకు అనుభవం, అవగాహన ఎంతో అవసరం.వ్యవసాయ రంగంలో విశేష సేవలందిస్తూ గుర్తింపు పొందిన గాదె నర్సిరెడ్డి వంటి రైతులను ప్రోత్సహించడం ద్వారా ఇతర రైతుల్లోనూ నూతన ఉత్సాహం పెరుగుతుంది.రైతుల అనుభవానికి, కృషికి తగిన గుర్తింపు లభించినప్పుడే వ్యవసాయ రంగంలో మరింత అభివృద్ధికి మార్గం సుగమమవుతుంది.



**మొరంపల్లి బంజర గ్రామానికి ప్రత్యేక గుర్తింపు**

గాదె నర్సిరెడ్డికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా ఉత్తమ రైతు అవార్డు అందడం మొరంపల్లి బంజర గ్రామంతో పాటు బూర్గంపహాడ్ మండలానికి కూడా గర్వకారణంగా నిలిచింది.గ్రామానికి చెందిన రైతుకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు లభించడంపై స్థానిక రైతులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ పురస్కారం మరింతమంది రైతులు వ్యవసాయ రంగంలో నూతన పద్ధతులను అవలంబిస్తూ, తమ అనుభవాలను ఇతరులతో పంచుకునేందుకు ప్రేరణగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తమవుతోంది.

**రైతు సేవకు గుర్తింపు.. వ్యవసాయానికి గౌరవం**

రైతుల సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధి లక్ష్యంగా కృషి చేసే వారిని గుర్తించి సత్కరించడం ఎంతో ప్రాధాన్యత కలిగిన అంశం.ఈ క్రమంలో గాదె నర్సిరెడ్డికి లభించిన ఉత్తమ రైతు అవార్డు ఆయన వ్యవసాయ ప్రస్థానంలో ఒక ప్రత్యేక మైలురాయిగా నిలిచింది.రైతు కష్టానికి తగిన గుర్తింపు లభిస్తే మరింత నిబద్ధతతో పనిచేసేందుకు ప్రోత్సాహం లభిస్తుందనే విషయాన్ని ఈ పురస్కారం చాటిచెబుతోంది.

# భైంసా జీఆర్పీ కళాశాలలో మోల్ డే..

**నిర్మల్ జిల్లా,అక్టోబర్ 23 (ప్రజాక్షేత్రం):** భైంసా పట్టణంలోని జీఆర్పీ ప్రభుత్వ డిగ్రీ మరియు పీజీ కళాశాలలో రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మోల్ డే వేడుకలను శుక్రవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. అంతర్జాతీయ రసాయన శాస్త్ర వారోత్సవాలను పురస్కరించుకొని కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ కె. బుచ్చయ్య అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రఘునాథ్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ.. రసాయన శాస్త్రంలో 'మోల్' భావన యొక్క ప్రాధాన్యతను వివరించారు. పదార్థంలోని అణువులు, పరమాణువులు, అయాన్లు వంటి కంటికి కనిపించని అత్యంత సూక్ష్మ కణాల సంఖ్యను ఖచ్చితంగా కొలవడానికి ఉపయోగించే ప్రామాణిక ప్రమాణమే 'మోల్' అని ఆయన స్పష్టం చేశారు. విద్యార్థులు రసాయన శాస్త్రంలో రాణించాలంటే ఇటువంటి ప్రాథమిక అంశాలపై పట్టు సాధించాలని ఆయన సూచించారు.
ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఐక్యూఏసీ సమన్వయకర్త డాక్టర్ యు. రవి కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు రసాయన శాస్త్ర విభాగం ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. కేవలం పుస్తకాల్లోని చదువుకే పరిమితం కాకుండా, విజ్ఞానాన్ని నిత్యజీవితంలో అన్వయించుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో రసాయన శాస్త్ర విభాగపు అధ్యాపకులు, వివిధ విభాగాల సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.




# పనుల నాణ్యతలో రాజీ పడొద్దు..

- **కమిషనర్ హనుమంతరావు, కలెక్టర్ భవేష్ మిశ్రా,**

**నిర్మల్ జిల్లా,అక్టోబర్ 23 (ప్రజాక్షేత్రం):** బాసర,త్వరలో ప్రారంభం కానున్న గోదావరి నది పుష్కరాల నేపథ్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల ముందస్తు ఏర్పాట్లను ముమ్మరం చేసినట్లు అధికారులు వెల్లడించారు. బాసర గోదావరి నది పుష్కర ఘాట్ల వద్ద జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రాతో కలిసి శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పుష్కరాల గడువు సమీపిస్తున్నందున పనుల వేగాన్ని పెంచాలని, ఎక్కడా అలసత్వానికి తావుండకూడదని స్పష్టం చేశారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇరిగేషన్, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ మరియు దేవాదాయ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఇక్కడ జరుగుతున్న ప్రతి పనినీ అత్యున్నత నాణ్యతా ప్రమాణాలతో, పక్కా ప్రణాళికతో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పుష్కరాల సమయానికి ఘాట్ల ఆధునికీకరణ, భద్రతా చర్యలను పూర్తి స్థాయిలోకి తీసుకురావాలని పేర్కొన్నారు.
భక్తుల సౌకర్యార్థం ఘాట్ల వద్ద తాగునీటి వసతి, నిరంతర పారిశుద్ధ్య నిర్వహణ, భద్రత కోసం బారికేడ్ల ఏర్పాటుతో పాటు వాహనాల పార్కింగ్ కొరకు ప్రత్యేక స్థలాలను కేటాయించనున్నట్లు తెలిపారు. వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖల సమన్వయంతో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈ సందర్భంగా అధికారులు స్పష్టం చేశారు.ఈ పర్యటనలో వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# విఠల్ గౌడ్ ను పరామర్శించిన బాజిరెడ్డి గోవర్ధన్

**కోటగిరి,అక్టోబర్ 23 (ప్రజాక్షేత్రం):** నిజామాబాద్ జిల్లా బాన్సువాడ నియోజకవర్గం కోటగిరి మండల కేంద్రానికి చెందిన గీతా పని వాళ్ళ సంఘం రాష్ట్ర కార్యదర్శి , జిల్లా సిపిఐ నాయకులు విఠల్ గౌడ్ ను మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ పరామర్శించారు. ఇటీవల విఠల్ గౌడ్ తల్లి మృతి చెందడంతో స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ గురువారం విఠల్ గౌడ్ ను తన నివాసంలో కలిసి పరామర్శించారు.ముందుగా విఠల్ గౌడ్ తల్లి అంబటి లచ్చవ్వ చిత్ర పటానికి పూలు సమర్పించి నివాళులు అర్పించిన బాజిరెడ్డి గోవర్ధన్ ఆయనకు ధైర్యం చెప్పారు. ఎల్లవేళలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. అనంతరం కోటగిరి మండల కేంద్రంలోని కుమ్మరి సంఘం లో కుమ్మరి సంఘం నాయకులను ఆయన మర్యాదపూర్వకంగా కలిసి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కుమ్మరి సంఘం అధ్యక్షులు హనుమాన్లు ఇంటికి వెళ్లి ఆయనను ఆత్మీయంగా పలకరించారు. అనంతరం బీసీ కాలనీలోని పలువురు నాయకుల ఇంటికి వెళ్లి వారిని ఆత్మీయంగా పలకరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు జుబేర్, కోటగిరి మండల బీఆర్ఎస్ నాయకులు తేల్ల రవికుమార్, మోరే కిషన్,నజీర్,పోతంగల్ మండల నాయకులు




సుదం నవీన్, ఆయా మండలాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతులను మోసం చేస్తున్న రైస్ మిల్లర్లు..!

- కుమ్మక్కై బయటి వ్యాపారులను రానివ్వని రైస్ మిల్లర్లు
- క్వింటాలుకు రూ.3700 నుండి 3300 కు ధర దింపేశారని ఆవేదన
- అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్న రైతులు
- మీడియా ముందు వాపోయిన రైతులు

**కోటగిరి,అక్టోబర్ 23(ప్రజాక్షేత్రం):**

కోటగిరి మండలంలోని బాయిల్డ్ రైస్ మిల్లర్లు కుమ్మక్కై బయటి వ్యాపారులను రానివ్వకుండా వడ్ల ధరలను తగ్గించి రైతులను మోసం చేస్తున్నారని కోటగిరి రైతులు మీడియా ముందు ఆవేదన వ్యక్తం చేశారు. కోటగిరి మండల కేంద్రంలో కొందరు రైతులు మీడియాతో మాట్లాడుతూ రెండు రోజుల క్రితం సన్న వడ్లకు క్వింటాలకు రూ.3700 నుండి రూ.3800 ఉన్న ధరను ప్రస్తుతం రూ.3300 నుండి రూ.3400కు స్థానిక రైస్ మిల్లర్లు కుమ్మక్కై తగ్గించారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రోజుల క్రితం వడ్లు కొంటామని రైస్ మిల్లర్లు చెప్పడంతో వరి కోశానని కోసిన తర్వాత రేట్లు తగ్గిపోయాయని చెబుతున్నారని సాధక్ అనే రైతు చెప్పారు. అడిగితే ఎక్కడ ధర ఉంటే అక్కడ అమ్ముకోవాలని చెబుతున్నారని వాపోయారు.ఈసారి ధరలు ఆశించిన స్థాయిలో ఉండడంతో రైతులకు మంచి లాభాలు వస్తాయని అనుకుంటే ఇంతలో రైస్ మిల్లర్లు కుమ్మక్కై రైతులను దగా చేస్తున్నారని మండిపడ్డారు. ప్రస్తుతం వడ్లకు రేటు పెరగడంతో గత సీజన్లో రూ.2200 రైస్ మిల్లర్లు కొన్న వడ్లకు ప్రస్తుతం బియ్యం తీసి రూ.8వేలకు క్వింటాలు బియ్యం అమ్మి సొమ్ము చేసుకుంటున్నారని తెలిపారు. కొత్త వడ్లు రైస్ మిల్లులకు చేరకముందే బియ్యం ధరలు ఎలా పెంచుతారని రైతులు ప్రశ్నించారు. రైతులకు ధర రూ.300 ఎక్కువ వస్తే ఓర్చుకోని రైస్ మిల్లర్లు గతసారి తక్కువ ధరకు కొన్న వడ్లకు బియ్యం తీసి రూ.8 వేల నుండి రూ.10 వేల రూపాయలకు క్వింటాలు బియ్యం ఎలా అమ్ముతారని దీని ద్వారా రైస్ మిల్లర్లకు కోట్ల రూపాయల లాభం వస్తుంది అని చెప్పారు. అలాంటి రైస్ మిల్లర్లు రైతులకు మాత్రం ధర ఎక్కువ వస్తే తగ్గించేందుకు కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులను మోసం చేస్తున్న రైస్ మిల్లర్లపై అధికారులు, జిల్లా కలెక్టర్ వెంటనే చర్యలు తీసుకోవాలని రైతులకు నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని రైతులు కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు సాధక్, మామిడి సాయిలు,మామిడి శ్రీనివాస్,చిత్తరి శ్రీనివాస్,ఆకుల ప్రవీణ్,కర్నె పోశెట్టి,తోట సాయిలు,పత్తి శంకర్,పత్తి దత్తు తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణలో తొలి ఆర్థిక సమ్మిళిత సంతృప్తి ప్రచార శిబిరం డబిల్‌గూడ గ్రామంలో నిర్వహణ

- శిబిరాన్ని సందర్శించిన మహేశ్వరం నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ అందెల శ్రీరాములు

**మహేశ్వరం,అక్టోబర్ 23 (ప్రజాక్షేత్రం)**

మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల పరిధిలో ఉన్న డబిల్‌గూడ గ్రామంలో తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఆర్థిక సమ్మిళిత సంతృప్తి ప్రచార కార్యక్రమంలో భాగంగా తొలి శిబిరాన్ని ఎస్‌బీఐ రంగారెడ్డి జిల్లా జనరల్ మేనేజర్ సుశీల్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఈ శిబిరాన్ని మహేశ్వరం నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ అందెల శ్రీరాములు సందర్శించి, బ్యాంకు అధికారులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆర్థిక పథకాలు, బ్యాంకింగ్ సేవలపై ప్రజలకు, ముఖ్యంగా రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తూ గ్రామగ్రామాన అవగాహన శిబిరాలు నిర్వహించాలని సూచించారు.

ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (పీఎం జై జై బివై), ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన ( పిఎం ఎస్ బి వై), అటల్ పెన్షన్ యోజన ( ఏపీ వై) వంటి పథకాలతో పాటు రైతులకు ఉపయోగపడే కిసాన్ క్రెడిట్ కార్డు ( కేసిసి) పంటల బీమా పథకాలు, ఆధార్ అనుసంధానం, ఈకేవైసీ, బ్యాంకు ఖాతాల్లో నామినీ వివరాల నవీకరణ తదితర సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

ప్రభుత్వ పథకాలు, బ్యాంకింగ్ సేవలను ప్రతి రైతు, ప్రతి అర్హుడైన పౌరుడు సద్వినియోగం చేసుకునేలా బ్యాంకు అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని అందెల శ్రీరాములు గారు కోరారు. కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు యాదిష్, స్థానిక సర్పంచ్ బుగ్గాని యాదమ్మ యాదయ్య, ప్రధాన కార్యదర్శి వనంపల్లి శ్రవణ్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.




## అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

- పెండింగ్ పెన్షన్లను వెంటనే విడుదల చేయాలి సీపీఎం

**వలిగొండ,అక్టోబర్ 23(ప్రజాక్షేత్రం):**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం పులిగిల్ల గ్రామంలోని అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న పెన్షన్లను తక్షణమే విడుదల చేయాలని సీపీఎం గ్రామ శాఖ డిమాండ్ చేసింది. శుక్రవారం గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు.ఈ సందర్భంగా సీపీఎం సీనియర్ నాయకులు వాకిటి వెంకట్‌రెడ్డి, మారబోయిన నరసింహ మాట్లాడుతూ.. గ్రామంలోని అర్హులైన పేదల సంఖ్యకు అనుగుణంగా ఇందిరమ్మ ఇళ్ల సంఖ్యను పెంచాలని, రాజకీయాలకు అతీతంగా గ్రామసభ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయాలని కోరారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి న్యాయం చేయాలని, పెండింగ్‌లో ఉన్న పెన్షన్లను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించకపోతే సోమవారం పులిగిల్ల గ్రామపంచాయతీ ఎదుట ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు .ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యులు వేముల నాగరాజు, వేముల అనిత,ఆనంద్, వడ్డెమాను ధనలక్ష్మి,మధు, నాయకులు వేముల చంద్రయ్య, వడ్డెమాన్ రవి,మారబోయిన ముత్యాలు,కొమ్మిడి కృష్ణారెడ్డి, దొడ్డి యాదగిరి,వేముల ప్రవీణ్, ఎల్లయ్య,లక్ష్మణ్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.



## జోయాలుక్కాస్ 'బ్రిలియన్స్ డైమండ్ జ్యువెలరీ షో'లో ప్రత్యేక ఆఫర్

- వజ్రాభరణాలు కొనుగోలుపై బంగారు నాణెం ఉచితం
- నవంబర్ 8 వరకు వనస్థలిపురం షోరూమ్‌లో అవకాశం

**రంగారెడ్డి జిల్లా,అక్టోబరు 23 (ప్రజాక్షేత్రం):**



పండుగల వేళ ఆభరణాల కొనుగోలుదారులకు ప్రముఖ జోయాలుక్కాస్ సంస్థ ప్రత్యేక కానుకను అందిస్తోంది. హైదరాబాద్‌లోని వనస్థలిపురం జోయాలుక్కాస్ షోరూమ్‌లో నిర్వహిస్తున్న 'బ్రిలియన్స్ డైమండ్ జ్యువెలరీ షో'సందర్భంగా రూ.లక్ష లేదా అంతకంటే ఎక్కువ విలువైన వజ్రాభరణాలను కొనుగోలు చేసే ప్రతి వినియోగదారుడికి ఒక బంగారు నాణెం ఉచితంగా అందించనున్నారు. ఈ ప్రత్యేక ఆఫర్ 2026 నవంబర్ 8 వరకు అందుబాటులో ఉంటుందని సంస్థ ప్రకటించింది.

**ఆధునిక డిజైన్లలో వజ్రాభరణాలు**

సంప్రదాయానికి ఆధునికతను జోడిస్తూ రూపొందించిన ఆకర్షణీయమైన వజ్రాభరణాలను ఈ ప్రదర్శనలో అందుబాటులో ఉంచారు. పండుగలు, వివాహాలు, శుభకార్యాలతో పాటు ప్రత్యేక సందర్భాల్లో ధరించేందుకు అనువైన విభిన్న డిజైన్ల ఆభరణాలు వినియోగదారులను ఆకట్టుకునేలా ఉన్నాయి. నాణ్యత, కళాత్మకత, ఆధునిక అభిరుచులకు అనుగుణంగా రూపొందించిన ఆభరణాలను ఒకే వేదికపై పరిశీలించి కొనుగోలు చేసే అవకాశం కల్పిస్తున్నారు.

**నవంబర్ 8 వరకు ప్రత్యేక అవకాశం**

వజ్రాభరణాల కొనుగోలుపై ఉచితంగా బంగారు నాణెం పొందే ఈ ఆఫర్ వినియోగదారులకు అదనపు ప్రయోజనాన్ని అందించనుంది. ఆసక్తి ఉన్నవారు వనస్థలిపురంలోని జోయాలుక్కాస్ షోరూమ్‌ను సందర్శించి 'బ్రిలియన్స్ డైమండ్ జ్యువెలరీ షో'లోని ఆభరణాలను పరిశీలించవచ్చు. ఈ ఆఫర్ 2026 నవంబర్ 8తో ముగియనుండటంతో కొనుగోలుదారులు గడువులోగా ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. ఆఫర్‌కు వర్తించే ఇతర నిబంధనలను షోరూమ్ ప్రతినిధుల ద్వారా తెలుసుకోవచ్చు.



## తాటి చెట్టు నుంచి పడి కల్లుగీత కార్మికుడు మృతి

- మృతుడి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా మంజూరు చేయాలి

**వలిగొండ,అక్టోబర్ 23 (ప్రజాక్షేత్రం):**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం రెడ్ల రేపాక గ్రామానికి చెందిన కల్లుగీత కార్మికుడు కొండం శంకరయ్య (62), తండ్రి కొండయ్య, తాటి చెట్టు ఎక్కి దిగే క్రమంలో ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందాడు. ఈ ఘటనతో గ్రామంలో విషాదం నెలకొంది.శంకరయ్య మృతిపట్ల కల్లుగీత కార్మిక సంఘం వలిగొండ మండల కమిటీ తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసింది. ప్రభుత్వం వెంటనే స్పందించి, మృతుడి కుటుంబానికి రావాల్సిన ఎక్స్‌గ్రేషియా మంజూరు చేసి ఆదుకోవాలని సంఘం నాయకులు కోరారు.ఈ కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు మద్దెల రాజయ్య,మండల ప్రధాన కార్యదర్శి పల్సం స్వామి, కమిటీ సభ్యులు జువ్వగాని శ్రీకాంత్,సొసైటీ అధ్యక్షులు నల్లమాసు నరసింహ,బిక్షపతి, సత్యనారాయణ,అచ్చయ్య, స్వామి,శ్రీకాంత్,వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

## భువనగిరి మార్కెట్ యార్డ్‌లో అక్రమ బోరు కలకలం: సీజ్ చేసి, కేసు నమోదు చేసిన అధికారులు

**యాదాద్రి భువనగిరి (ప్రజాక్షేత్రం):**




యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మార్కెట్ యార్డ్ పరిధిలో ఎలాంటి అనుమతులు లేకుండా, ఎడవెల్లి శ్రీనివాస్ అనే వ్యక్తి నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా తవ్వుతున్న బోరు వేయడాన్ని అధికారులు అడ్డుకున్నారు.ఎల్నినో ప్రభావం నేపథ్యంలో రాష్ట్రంలో భూగర్భ జలాల పరిరక్షణకు ప్రభుత్వం కఠిన ఆంక్షలు విధించినప్పటికీ, క్షేత్రస్థాయిలో నిబంధనలు గాలికి కొట్టుకుపోతుండటం ఈ ఘటనతో మరోసారి బట్టబయలైంది.

మార్కెట్ యార్డ్‌లో రహస్యంగా బోరు తవ్వుతున్నారనే పక్కా సమాచారంతో రెవెన్యూ మరియు మున్సిపల్ అధికారులు అప్రమత్తమయ్యారు. వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని తనిఖీలు నిర్వహించగా, ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా బోరు వేస్తున్నట్లు తేలింది. దీంతో ఆగ్రహించిన అధికారులు తక్షణమే పనులను నిలిపివేయించారు.

బోరు తవ్వడానికి ఉపయోగించిన శ్రీ కనకదుర్గ బోర్వెల్ బోరింగ్ బండిని వాహనాన్ని అదుపులోకి తీసుకుని, స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ అక్రమ తవ్వకాలకు బాధ్యులైన వారిపై మరియు బండి యజమానిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సీఎస్ సంజు జాజు హెచ్చరికలు బేఖాతరు

రాష్ట్రంలో ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, ముఖ్యంగా ఎల్నినో ప్రభావం వల్ల వర్షాభావ పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉందని ప్రభుత్వం ముందస్తుగా హెచ్చరించింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఎక్కడా కొత్తగా బోరుబావుల తవ్వకాలకు ఎలాంటి అనుమతులు ఇవ్వకూడదని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి CS సంజు జాజు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోకుండా కాపాడటమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎస్ పదేపదే స్పష్టం చేసినా, క్షేత్రస్థాయిలోని కొందరు అధికారుల అనాలోచిత నిర్ణయాలు, నిబంధనలను ఉల్లంఘించే ధోరణి ప్రభుత్వ ఆశయాలకు తూట్లు పొడుస్తోంది. ప్రభుత్వ నిబంధనలను కిందిస్థాయిలో అమలు చేయాల్సిన అధికారిక యంత్రాంగమే స్వయంగా ఇలాంటి చర్యలకు పాల్పడటంపై స్థానికంగా తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ప్రభుత్వ మార్కెట్ యార్డ్‌లోనే నిబంధనలకు విరుద్ధంగా బోరు వేయడం అధికారుల ద్వంద్వ వైఖరిని ఎత్తిచూపుతోంది.

వేసవి తీవ్రత పెరుగుతున్న తరుణంలో, ఇలాంటి అక్రమ బోర్లు తవ్వితే సమీప ప్రాంతాల్లో తాగునీటి ముప్పు మరింత పెరిగే అవకాశం ఉంది.

## దేవరకొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జిగా చింతల వెంకటేశ్వర్ రెడ్డి నియామకం

**యాదాద్రి భువనగిరి,అక్టోబర్ 23(ప్రజాక్షేత్రం):**



త్వరలో జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని తెలంగాణ రాష్ట్ర బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు కేటీఆర్ నియోజకవర్గాల వారీగా ఎన్నికల ఇన్‌చార్జిలను ప్రకటించారు. ఈ క్రమంలో నల్గొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జిగా బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు చింతల వెంకటేశ్వర్ రెడ్డి ని నియమించడం జరిగింది.

ఈ సందర్భంగా చింతల వెంకటేశ్వర్ రెడ్డి తనకు ఈ బాధ్యతను అప్పగించిన తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు కేసీఆర్ కి, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీ కల్వకుంట్ల తారక రామారావు కేటీ ఆర్, మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలియజేశారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

## ఎల్ నినో ప్రభావం పై గ్రామ సభలు.

**వలిగొండ,అక్టోబర్ 23(ప్రజాక్షేత్రం):**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం ఎల్‌నినో ప్రభావం కారణంగా వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉండటంతో పాటు, ఉష్ణోగ్రతలు అధికంగా ఉండే పరిస్థితులు నెలకొనే అవకాశం ఉందని మండల పంచాయతీ అభివృద్ధి అధికారి జి. జలంధర్ రెడ్డి రైతులకు సూచించారు. ఈ నేపథ్యంలో రైతులు తక్కువ నీటి వినియోగంతో సాగు చేయగల పంటల రకాలను ఎంపిక చేసుకోవాలని, అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా, ప్రణాళికాబద్ధంగా వినియోగించుకోవాలని ఆయన కోరారు.దాసిరెడ్డిగూడెం గ్రామ సర్పంచ్ రాపోలు గోపి అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభకు ఎంపీడీవో శ్రీ జి. జలంధర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, ఎల్‌నినో ప్రభావం, తక్కువ వర్షపాతం, అధిక ఉష్ణోగ్రతల వల్ల వ్యవసాయ రంగంపై పడే ప్రభావాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటితో సాగు చేయగల పంటలు, అనువైన పంట రకాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. నీటి లభ్యతకు అనుగుణంగా పంటల సాగు చేపట్టాలని, నీటిని వృథా చేయకుండా తగిన జాగ్రత్తలు పాటిస్తూ పంటలను సంరక్షించుకోవాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఏపీఓ, వ్యవసాయ శాఖ ఏఈ, విద్యుత్ శాఖ ఏఈ, వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీమతి జోక్ అపర్ణ, రైతులు పాల్గొన్నారు.అనంతరం ఎదుళ్ళగూడెం గ్రామ సర్పంచ్ కొంతం శ్రీను అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభకు కూడా ఎంపీడీవో జి. జలంధర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై రైతులకు ఎల్‌నినో ప్రభావంపై అవగాహన కల్పించారు.



## కేంద్ర చీఫ్ ఎలక్షన్ కమీషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి

- ప్రజాస్వామ్య గొంతుకను నొక్కుతున్న మోడీ ప్రభుత్వం
- ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జ్ఞానేశ్ కుమార్ దిష్టిబొమ్మ దగ్ధం
- కోమటిరెడ్డి చంద్రారెడ్డి సిఐటియు జిల్లా అధ్యక్షులు

**యాదాద్రి భువనగిరి,అక్టోబర్ 23(ప్రజాక్షేత్రం):**

ప్రజాస్వామ్యాన్ని,రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తూ 2023లో ఉన్న చట్టాన్ని రద్దు చేసి కొత్త చట్టాన్ని తీసుకొచ్చి చీఫ్ ఎలక్షన్ కమిషన్ నియామక ప్రక్రియను మార్చేసి అంతకు ముందు ఉన్న సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ స్థానంలో కేంద్ర కేబినెట్ మినిస్టర్ అమిత్ షా ను కమిటీలో పెట్టుకొని మెజారిటీ పేరుతో తన అనుకూలమైన వ్యక్తి జ్ఞానేష్ కుమార్ ను నియమించి అతని చేత అనేక తప్పులు చేయించి దొంగ చాటుగా బిజెపి అనేక రాష్ట్ర ప్రభుత్వాలను కైవసం చేసుకుంటుందని అన్నారు.

ప్రజాస్వామ్య బద్ధంగా నిరసన తెలిపే హక్కును కాలరాస్తూ ఢిల్లీలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న ఆందోళనలను అణిచివేయడాన్ని బీబీనగర్ మండల ప్రజాసంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాయని అన్నారు. ప్రజాసంఘాల పిలుపులో భాగంగా శుక్రవారం రోజున మండల కమిటీల ఆధ్వర్యంలో బ్రాహ్మణపల్లి రోడ్ చౌరస్తాలో చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈకార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి పాల్గొని మాట్లాడుతూ ఓట్ చోర్ కు పాల్పడుతున్న చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని, దేశంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలని అన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం ఫాసిస్ట్ హిట్లర్ ను తలపించే విధంగా ఉద్యమాలను అణిచివేసే ప్రయత్నం చేస్తుందని అన్నారు. సర్ లో జరుగుతున్న అవకతవకలను సమీక్షించి నిజమైన ఓటర్లను నమోదు చేసే బాధ్యత తీసుకోకుండా నిర్బంధాలతో ఉద్యమాన్ని అణిచివేయాలని చూస్తే హిట్లర్ కు పట్టిన గతే మోడీకి పడుతుందని అన్నారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి ప్రాణాధారమని ప్రజలు తమ పాలకులను ఎన్నుకునే అత్యంత కీలకమైన రాజ్యాంగ హక్కు అని అన్నారు. ఓటర్ల జాబితాలో అక్రమాలు చోటు చేసుకోకుండా చూడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉన్నదన్నారు. అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా అనహర్హులకు అవకాశం కల్పించకుండా పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియను నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్ ఐ ఆర్ ప్రక్రియ ద్వారా పెద్ద సంఖ్యలో ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోతున్నారన్నారు. దేశంలో ఇప్పటికే 13 కోట్ల మందిని, రాష్ట్రంలో లక్షలాది మందిని ఓటర్ల జాబితా నుండి తీసివేశారన్నారు. ఓటర్ల జాబితా సవరణ పేరుతో ప్రజాస్వామ్య హక్కులకు విఘాతం కలిగించే చర్యలు చేపట్టడం సరైనది కాదని అన్నారు. కేంద్ర చీఫ్ ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్‌కుమార్ వెంటనే రాజీనామా చేయాలని, ఎస్ ఐ ఆర్ ప్రక్రియను నిలిపివేసి, ఓటర్ల జాబితా నుంచి తొలగించిన అర్హులైన ఓటర్ల పేర్లను తిరిగి చేర్చాలని, 2023 లో చేసిన ఎన్నికల కమిషన్ నియామక చట్టాన్ని రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ బండారు శ్రావణ్ కుమార్,రైతుసంఘం మండల నాయకులు బండారు శ్రీరాములు,వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి గాడి శ్రీనివాసు,నాయకులు ఓవాల్దాస్ సతీష్, పంజాల జంగయ్య, ఓవల్దాస్ హరికృష్ణ, దండెబోయిన శ్రీశైలం, చెట్టబోయిన కనకయ్య, కుంట యాదగిరిరెడ్డి,పాశం బాలయ్య, పొట్ట యాదగిరి,పెరుమాళ్ళ స్వామి,పొట్ట రమేష్,పొన్నాల మహేష్ తదితరులు పాల్గొన్నారు.





## శంకర్ పల్లి పి ఏ సి ఎస్ పాలక వర్గసమావేశం

- **రైతులకు పంట రుణాలు, గోల్డ్ లోన్లు అందించేందుకు తీర్మానం**
- **పీఏసీఎస్ అధ్యక్షులు బొల్లారం వెంకటరెడ్డి అధ్యక్షతన సమావేశం.**

**శంకర్‌పల్లి అక్టోబర్ 23(ప్రజాక్షేత్రం):**

శంకర్‌పల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) అధ్యక్షులు బొల్లారం వెంకటరెడ్డి అధ్యక్షతన శుక్రవారం పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రైతులకు పంట రుణాలు, దీర్ఘకాలిక రుణాలు, గోల్డ్ లోన్లు అందించే అంశాలపై చర్చించారు. రైతులకు అవసరమైన రుణాలు అందించడంతో పాటు, పంట రుణాలను సకాలంలో రెన్యువల్ చేయాలని పాలక వర్గం తీర్మానించింది. ఈ సమావేశంలో పాలకవర్గ సభ్యులు పార్షి బాలకృష్ణ, మాణిక్యరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, ఇందిరమ్మ, శ్రీనివాస్‌రెడ్డి, లచ్చిరెడ్డి, మల్లికార్జున్, ప్రశాంత్‌రెడ్డి, సామయ్య, శంకర్, చంద్రకళ, శ్రీధర్‌తో పాటు పీఏసీఎస్ కార్యదర్శి రాంరెడ్డి పాల్గొన్నారు.



## యువత చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

- **సీఐ మల్లికార్జున్ రెడ్డి**

**మొయినాబాద్, అక్టోబర్ 23(ప్రజాక్షేత్రం):**

యువత చట్టాలపై అవగాహన పెంచుకుని బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సీఐ మల్లికార్జున్ రెడ్డి అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో భాగంగా శుక్రవారం మొయినాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేజీ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు పోలీసుల విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజల భద్రతలో పోలీసుల పాత్రను వివరించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో పార్థసింహారెడ్డి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అనాజీపూర్ అభివృద్ధి పనులకు శ్రీకారం

- **రూ.5 లక్షలతో డ్రైనేజీ నిర్మాణం.**
- **అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన సర్పంచ్ సోమని నిర్మల ఇస్తారి**

**రాయపోల్ అక్టోబర్ 23(ప్రజాక్షేత్రం):**

దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి సహకారంతో గ్రామంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం జరిగిందని అనాజీపూర్ సర్పంచ్ సోమని నిర్మల ఇస్తారి అన్నారు. శుక్రవారం రాయపోల్ మండలం అనాజీపూర్ గ్రామంలో ఎస్సీ కాలనీలో రూ.5 లక్షల నిధులతో నూతనంగా చేపట్టనున్న డ్రైనేజీ నిర్మాణ పనులకు భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనాజీపూర్ గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా ఈ పనులను చేపడుతున్నట్లు వారు తెలిపారు. కాలనీలో మురుగునీటి సమస్యను పరిష్కరించి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు డ్రైనేజీ నిర్మాణం ఎంతగానో ఉపయోగపడుతుందని ఆమె పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను దశలవారీగా కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వేణుగోపాల్ గౌడ్, వార్డు సభ్యులు వెంకని స్వామి, దాసరి సత్యనారాయణ, మేఘన, రాజు, లక్ష్మి, మల్లేశం, సంగీత, రవి తదితరులు పాల్గొన్నారు.



## విద్యుత్ షాక్‌తో మృతి చెందిన వెంకని స్వామి కుటుంబానికి రూ.5 లక్షల నష్టపరిహారం అందజేత

**రాయపోల్ అక్టోబర్ 23(ప్రజాక్షేత్రం):**

అనాజిపూర్ గ్రామానికి చెందిన వెంకని స్వామి కుటుంబానికి పరిహారం అందేలా చొరవ తీసుకున్న బీజేపీ ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి గజ్వేల్ రామచంద్రం బాధిత కుటుంబానికి నష్ట పరిహారం అదేవిధంగా కృషి చేశారు ఇటీవల విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన వెంకని స్వామి కుటుంబానికి ప్రభుత్వం నుంచి అందాల్సిన నష్టపరిహారం మంజూరు కావడంలో బీజేపీ ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి గజ్వేల్ రామచంద్రం చొరవ తీసుకున్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి బాధిత కుటుంబానికి నష్టపరిహారం అందేలా మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు సహకారంతో కృషి చేశారు.ఈ నేపథ్యంలో, ఈరోజు తొగుట సబ్ ఇంజనీర్ శివకుమార్ చేతుల మీదుగా బాధిత కుటుంబానికి రూ.5 లక్షల నష్టపరిహారం చెక్కును అందజేశారు.కుటుంబ పెద్దను కోల్పోయిన బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందించడం కొంత ఊరటనివ్వనుంది. బాధిత కుటుంబానికి అండగా నిలిచి, ప్రభుత్వం నుంచి రావాల్సిన పరిహారం అందేలా కృషి చేసినట్లు గజ్వేల్ రామచంద్రం తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి, బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా తన వంతు కృషి కొనసాగిస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖకు చెందిన మోసిన్, బీజేపీ నాయకులు కొత్తపల్లి నరేష్ తదితరులు పాల్గొన్నారు.







# ఐదు ఎకరాలు...ఐక్యతకు బాటలు

- **హోతీ-కె ఈద్గాకు భూమి కేటాయింపు**
- **గంగా-జమునా తెహజీబ్‌కు పెద్దపీట.**
- **అన్ని వర్గాల సమానత్వమే కాంగ్రెస్ లక్ష్యం**
- **ఎంపీ సురేష్ కుమార్ షెట్కర్**

**జహీరాబాద్,అక్టోబర్ 23 (ప్రజా క్షేత్రం):**

మున్సిపాలిటీ పరిధిలోని హోతికె గ్రామం, వార్డు నంబర్ 7లో ఉన్న ఈద్గా కోసం 5 ఎకరాల భూమి కేటాయింపు స్థానికంగా ప్రాధాన్యత సంతరించుకుంది. మతసామరస్యం,సోదరభావం, సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలిచే ఈ నిర్ణయం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ షెట్కర్ ముఖ్య అతిథిగా హాజరుకాగా, జహీరాబాద్ మున్సిపల్ చైర్మన్ యూనస్ అహ్మద్ గౌరవ అతిథిగా పాల్గొన్నారు. వార్డు నంబర్ 7 కౌన్సిలర్ వకీల్ చౌహాన్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**సమానత్వమే కాంగ్రెస్ విధానం**

ఈ సందర్భంగా ఎంపీ సురేష్ కుమార్ షెట్కర్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ పాలనలో అన్ని మతాలు, కులాలు, వర్గాల ప్రజలకు సమాన గౌరవం కల్పిస్తూ, వారి అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడమే లక్ష్యమని పేర్కొన్నారు. సమాజంలోని ప్రతి వర్గానికి న్యాయం జరగాలని, ప్రజలందరూ ఐకమత్యంతో ముందుకు సాగాలని అన్నారు.

భారతీయ సంస్కృతిలో ప్రత్యేక స్థానాన్ని కలిగిన గంగాజమునా తెహజీబ్ సంప్రదాయం మత సామరస్యం, పరస్పర గౌరవం, సోదరభావానికి ప్రతీక అని పేర్కొన్నారు. అన్ని మతాల ప్రజలు పరస్పర విశ్వాసంతో కలిసి జీవించడం దేశ ఐక్యతకు బలమని, సమానత్వం, సామాజిక న్యాయం ఆధారంగానే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని వివరించారు.

**ఈద్గా అభివృద్ధికి కీలక ముందడుగు**

హోతికె ఈద్గా కోసం 5 ఎకరాల భూమి కేటాయింపు స్థానిక ముస్లిం సమాజానికి ప్రాధాన్యత కలిగిన అంశంగా నిలిచింది. ఈ భూమి ఈద్గా అభివృద్ధికి, ప్రార్థనలు మరియు ఇతర మతపరమైన కార్యక్రమాలకు ఉపయోగపడుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల మతపరమైన అవసరాలను గుర్తించి, అన్ని వర్గాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడం సామాజిక ఐక్యతను మరింత బలోపేతం చేస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు.

ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, యువత, ఈద్గా కమిటీ సభ్యుల సమన్వయంతో ప్రాంత అభివృద్ధికి మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

కార్యక్రమంలో వార్డు నంబర్ 7 కౌన్సిలర్ వకీల్ చౌహాన్‌తో పాటు షకీల్ పటేల్,జాకీర్ అహ్మద్, నిసార్ పటేల్,సొహైల్ పటేల్,మెహబూబ్,మహమ్మద్ మొయిన్,మజీద్ భాయ్ (మజీద్ పాన్ షాప్),మహమ్మద్ సిరాజ్, వార్డు నంబర్ 7 యువ నాయకులు,జహీరాబాద్ ఈద్గా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. ఐక్యత,సమానత్వం, సోదరభావంతో హోతికె ప్రాంతం మరింత అభివృద్ధి చెందాలని స్థానికులు ఆకాంక్షించారు.

# దళితుడిపై దాడిని తీవ్రంగా ఖండించిన ఎమ్మార్పీఎస్

- **దాడికి గురైన భాస్కర్‌ను పరామర్శించిన ఎమ్మార్పీఎస్ బృందం.**
- **నిందితులను వెంటనే అరెస్టు చేయాలి — లేనిపక్షంలో ఆందోళన తప్పదు!**
- **ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షులు పెంటనోళ్ల నర్సింహా మాదిగ.**

**చేవెళ్ల అక్టోబర్ 23(ప్రజాక్షేత్రం):**





దళితుడైన భాస్కర్‌పై జరిగిన దాడిని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) తీవ్రంగా ఖండించింది. దాడికి గురైన భాస్కర్‌ను ఎమ్మార్పీఎస్ బృందం పరామర్శించి, ఆయనకు అండగా ఉంటామని భరోసా కల్పించింది. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ, దళితులపై దాడులకు పాల్పడే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భాస్కర్‌పై దాడి చేసిన నిందితులను పోలీసులు వెంటనే అరెస్టు చేసి, బాధితుడికి న్యాయం చేయాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును నిర్వీర్యం చేసేందుకు కౌంటర్ కేసులు పెట్టే ప్రయత్నాలను సహించేది లేదు. బాధితుడిని భయభ్రాంతులకు గురిచేయడం, కేసు దర్యాప్తును ప్రభావితం చేయడం వంటి చర్యలకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను డిమాండ్ చేశారు. కౌంటర్ కేసు తప్పుడు ఉద్దేశంతో పెట్టినట్లు తేలితే, బాధ్యులపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. దళితులపై దాడులు జరిగినప్పుడు బాధితులకు అండగా నిలబడటం, వారికి న్యాయం జరిగే వరకు పోరాటం చేయడం ఎమ్మార్పీఎస్ బాధ్యత అని నాయకులు పేర్కొన్నారు. దళితులపై దాడులను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. భాస్కర్‌పై దాడి చేసిన నిందితులను తక్షణమే అరెస్టు చేయాలి. లేని పక్షంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. బాధితుడికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పెంటనోల్ల నరసింహ మాదిగ, ఎంఎస్పి మాజీ జిల్లా అధ్యక్షులు రావుగల్ల బాబు మాదిగ, ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు కాడిగల్ల ప్రవీణ్ కుమార్ మాదిగ, ఊరెంట ప్రవీణ్, మండల అధ్యక్షులు కొండాపూర్ మల్లేష్, శంకర్ పల్లి మండల అధ్యక్షులు లింగం సాయి, మొయినాబాద్ మండల అధ్యక్షులు రామగల్ల కుమార్, షాబాద్ మండల అధ్యక్షులు మల్కి ప్రవీణ్, మాజీ మండల అధ్యక్షులు కొడిగారి మహేందర్, రవి, ఈదులపల్లి రాములు మాదిగ, మల్లికార్జున్, వెంకటేష్, కృష్ణ, రాజేందర్, విజయ్, కుమార్, చింటూ, వినోద్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## పెద్దేముల్ మండల కాంగ్రెస్ పగ్గాలు లొంక నర్సింహులుకు ?

- **మండల అధ్యక్ష పదవికి లొంక నర్సింహులు పేరును అధిష్ఠానానికి సిఫారసు**
- **పినెముల మహిపాల్ రెడ్డి రాజీనామా ప్రచారం నేపథ్యంలో కీలక పరిణామం**
- **పార్టీ అధిష్ఠానం నిర్ణయంపై కాంగ్రెస్ శ్రేణుల్లో ఆసక్తి**

**పెద్దేముల్, అక్టోబర్ 23(ప్రజాక్షేత్రం):**

వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గంలోని పెద్దేముల్ మండల కాంగ్రెస్ రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రస్తుత మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పినెముల మహిపాల్ రెడ్డి స్థానంలో కొత్త నాయకుడిని నియమించే అంశం చర్చకు రావడంతో, మండల అధ్యక్ష బాధ్యతల కోసం లొంక నర్సింహులు పేరును పార్టీ అధిష్ఠానానికి సిఫారసు చేసినట్లు సమాచారం.దీంతో పెద్దేముల్ మండల కాంగ్రెస్ పార్టీ పగ్గాలు తదుపరి ఎవరికి అప్పగిస్తారనే అంశం స్థానిక రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది.పినెముల మహిపాల్ రెడ్డి మండల కాంగ్రెస్ అధ్యక్ష పదవికి స్వచ్ఛందంగా రాజీనామా చేయనున్నారనే ప్రచారం ఇటీవల రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. పార్టీ సంస్థాగత పదవులు, సహకార సంఘాల పదవుల మధ్య సర్దుబాటుకు సంబంధించి టీపీసీసీ నిబంధనలపై జరుగుతున్న చర్చ ఈ పరిణామానికి కారణంగా వినిపిస్తోంది. ప్రస్తుతం మహిపాల్ రెడ్డి తట్టేపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) చైర్మన్‌గా కూడా కొనసాగుతున్నారు.ఈ నేపథ్యంలో మండల పార్టీ అధ్యక్ష బాధ్యతలకు కొత్త నాయకుడి ఎంపికపై కసరత్తు జరుగుతున్నట్లు తెలుస్తోంది.మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష బాధ్యతలను లొంక నర్సింహులుకు అప్పగించాలనే ప్రతిపాదనను పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం.అయితే ఆయన నియామకంపై అధిష్ఠానం నుంచి తుది నిర్ణయం వెలువడాల్సి ఉంది. సిఫారసు ఆమోదం పొందితే పెద్దేముల్ మండల కాంగ్రెస్ పార్టీకి కొత్త నాయకత్వం వచ్చే అవకాశం ఉంటుంది. ఈ పరిణామంపై స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల్లో చర్చ సాగుతోంది.పెద్దేముల్ మండల పరిధిలోని 38 గ్రామపంచాయతీలకు గాను 36 గ్రామ పంచాయతీల్లో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీల ఏర్పాటు పూర్తయినట్లు పార్టీ వర్గాలు గతంలో వెల్లడించాయి. ఈ కమిటీలను సమన్వయం చేస్తూ పార్టీ కార్యక్రమాలను గ్రామస్థాయిలో ముందుకు తీసుకెళ్లడం కొత్త అధ్యక్షుడి ముందున్న ప్రధాన బాధ్యతగా మారనుంది. కార్యకర్తలను సమన్వయం చేసుకోవడం, గ్రామస్థాయిలో పార్టీని క్రియాశీలకంగా ఉంచడం, పార్టీ నాయకత్వం సూచనలను అమలు చేయడం వంటి అంశాలు ప్రాధాన్యం సంతరించుకోనున్నాయి.

మహిపాల్ రెడ్డి రాజీనామా ప్రచారంపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉండగా, లొంక నర్సింహులు పేరును సిఫారసు చేసినట్లు వస్తున్న సమాచారం కొత్త చర్చకు తెరలేపింది. ఈ సిఫారసుకు అధిష్ఠానం ఆమోదం తెలుపుతుందా? మహిపాల్ రెడ్డి స్థానంలో నర్సింహులు బాధ్యతలు చేపడతారా? లేక పార్టీ నాయకత్వం మరో నిర్ణయం తీసుకుంటుందా? అన్న అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. మొత్తంగా, పెద్దేముల్ మండల కాంగ్రెస్‌లో నాయకత్వ మార్పుపై జరుగుతున్న పరిణామాలు స్థానిక రాజకీయాల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. అధికారిక ప్రకటన వెలువడిన తర్వాతే తదుపరి పరిణామాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.



## జర్నలిస్టు శంకర్ గౌడ్ అరెస్టును తీవ్రంగా ఖండించిన జర్నలిస్టుల సంఘం

- **ప్రశ్నించే గొంతుకలను అణచివేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధం**
- **ప్రభుత్వం పునరాలోచించి న్యాయబద్ధమైన చర్యలు తీసుకోవాలి**
- **జిల్లా అధ్యక్షుడు ఎం. రవీందర్, ప్రధాన కార్యదర్శి ప్రహ్లాద్**

**వికారాబాద్ ప్రతినిధి, (ప్రజాక్షేత్రం):**



జర్నలిస్టు శంకర్ గౌడ్ అరెస్టును తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టియుడబ్ల్యూజే హెచ్143) వికారాబాద్ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ, ప్రజల తరఫున ప్రశ్నించే జర్నలిస్టుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా అధ్యక్షుడు ఎం. రవీందర్, ప్రధాన కార్యదర్శి ప్రహ్లాద్ ప్రభుత్వాన్ని కోరారు. ప్రజాస్వామ్యంలో మీడియా స్వేచ్ఛకు కీలకమైన స్థానం ఉందని, జర్నలిస్టులు తమ వృత్తిపరమైన బాధ్యతలను నిర్భయంగా నిర్వర్తించే వాతావరణాన్ని ప్రభుత్వం కల్పించాలని వారు పేర్కొన్నారు. శంకర్ గౌడ్ అరెస్టు వ్యవహారంపై ప్రభుత్వం పునరాలోచించి, చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా న్యాయబద్ధమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వాన్ని, అధికార యంత్రాంగాన్ని, ప్రజా సమస్యలకు సంబంధించిన అంశాలను ప్రశ్నించడం మీడియా బాధ్యతలో భాగమని వారు స్పష్టం చేశారు. ఏదైనా ఘటనపై అభ్యంతరాలు లేదా ఫిర్యాదులు ఉంటే చట్టబద్ధమైన విధానంలో విచారణ జరిపి వాస్తవాలను నిర్ధారించాలని, జర్నలిస్టుల్లో భయాందోళనలు కలిగించే పరిస్థితులు ఏర్పడకుండా చూడాలని కోరారు. చట్టం అందరికీ సమానంగా వర్తించాలని, ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తికి చట్ట ప్రకారం తన వాదన వినిపించుకునే అవకాశం ఉండాలని పేర్కొన్నారు. అదే సమయంలో జర్నలిస్టుల వృత్తిపరమైన స్వేచ్ఛ, హక్కులు, భద్రతను కాపాడాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వంపై ఉందన్నారు. శంకర్ గౌడ్ అరెస్టుకు సంబంధించిన అంశాలను ప్రభుత్వం సమీక్షించి, చట్టబద్ధమైన ప్రక్రియకు విరుద్ధంగా కాకుండా న్యాయబద్ధమైన పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని టియు డబ్ల్యూజే హెచ్143) వికారాబాద్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ప్రజాస్వామ్య విలువలను కాపాడాలంటే మీడియా స్వేచ్ఛను గౌరవిస్తూ, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే జర్నలిస్టులకు తగిన రక్షణ కల్పించాలని జిల్లా అధ్యక్షుడు ఎం. రవీందర్, ప్రధాన కార్యదర్శి ప్రహ్లాద్ పేర్కొన్నారు.

## పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన ఆర్డీఓ, పోలీసు అధికారులు

- **పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్ల పరిశీలన**

**మొయినాబాద్, అక్టోబర్ 23(ప్రజాక్షేత్రం):**



అసిస్టెంట్ సైంటిస్ట్ (అనలిస్ట్ గ్రేడ్-II) పరీక్షల నిర్వహణకు చేపట్టిన ఏర్పాట్లను చేవెళ్ల ఆర్డీఓ పార్థ సింహారెడ్డి, మొయినాబాద్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఓ వై. మల్లికార్జున్ రెడ్డి, ఎస్ఐ సత్యనారాయణ పరిశీలించారు. శనివారం నిర్వహించనున్న పరీక్షల నేపథ్యంలో వివిధ పరీక్షా కేంద్రాలను సందర్శించి తనిఖీలు చేపట్టారు.ఈ సందర్భంగా కేజీ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల, గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాల, వీజేఐటీ ఇంజనీరింగ్ కళాశాల, చైతన్య డీమ్డ్ టు బి యూనివర్సిటీ, జేబీఐటీ ఇంజనీరింగ్ కళాశాలల్లో పరీక్షల నిర్వహణకు చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్షలు ప్రశాంతంగా, సజావుగా జరిగేలా తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. అసిస్టెంట్ సైంటిస్ట్ (అనలిస్ట్ గ్రేడ్-II) పరీక్షలు అక్టోబర్ 24న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు విడతల్లో నిర్వహించనున్నారు. పరీక్షా కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు సక్రమంగా ఉండేలా అధికారులు పరిశీలన చేపట్టారు.



## తెలంగాణ సచివాలయంలో ప్రముఖుల ఆత్మీయ కలయిక

- **మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఛాంబర్‌లో వివిధ రంగాల ప్రముఖుల సమాగమం**

**హైదరాబాద్ అక్టోబర్ 23(ప్రజాక్షేత్రం):**

తెలంగాణ సచివాలయంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఛాంబర్‌లో పలువురు ప్రముఖులు ఆత్మీయంగా కలుసుకున్నారు. వివిధ సామాజిక, రాజకీయ, విద్యా రంగాలకు చెందిన ప్రముఖుల కలయిక స్నేహపూర్వక వాతావరణంలో జరిగింది. ఈ ఆత్మీయ కలయికలో పద్మశ్రీ అవార్డు గ్రహీత ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ, బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఎంపీ ఆర్. కృష్ణయ్య, ఐఆర్ ఎడ్యుకేషన్ వైస్ చైర్మన్ ఇటికాల పురుషోత్తం, ఎమ్మెల్యే పాల్వాయి హరీష్, బీజేపీ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ పాల్గొన్నారు. జై భీమ్ టీవీ ఫౌండర్ & చైర్మన్, ప్రజాదరణ పార్టీ వ్యవస్థాపకులు డా. బరిగెల శివ సైతం ఈ ఆత్మీయ కలయికలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖులు పరస్పరం పలకరించుకుని ఆత్మీయంగా సంభాషించుకున్నారు. వివిధ రంగాల్లో ప్రజా జీవితంతో అనుబంధం కలిగిన నాయకులు ఒకే చోట కలుసుకోవడం ఈ సమావేశానికి ప్రత్యేకతను తీసుకొచ్చింది. సామాజిక చైతన్యం, ప్రజా సమస్యలు, ప్రజాసేవ వంటి అంశాలపై తమ తమ రంగాల్లో కృషి చేస్తున్న ప్రముఖుల ఈ కలయిక స్నేహపూర్వక వాతావరణంలో సాగింది.



## సరూర్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంఎస్ఎఫ్ బాలికల కమిటీ ఏర్పాటు

- **మాదిగ విద్యార్థినుల్లో చైతన్యం నింపేందుకు ప్రత్యేక సమావేశం**
- **నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాల అందజేత**

**సరూర్‌నగర్, అక్టోబర్ 23(ప్రజాక్షేత్రం):**

పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు మాదిగ స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్) నూతన కమిటీల నిర్మాణంలో భాగంగా ఎల్‌బీనగర్ నియోజకవర్గ పరిధిలోని సరూర్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాదిగ విద్యార్థినుల చైతన్య సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా కళాశాలలో ఎంఎస్ఎఫ్ బాలికల కమిటీని ఏర్పాటు చేసి, నూతన కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ ఎల్‌బీనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొమ్ము రాజశేఖర్ మాదిగ నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాలను అందజేశారు. విద్యార్థినుల్లో సామాజిక చైతన్యం పెంపొందించడం, విద్యార్థుల హక్కులపై అవగాహన కల్పించడం, విద్యారంగంలో ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి కృషి చేయడం వంటి లక్ష్యాలతో కమిటీని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఎంఎస్ఎఫ్ బాలికల కమిటీ అధ్యక్షురాలిగా జి.తన్వి మాదిగ, అధికార ప్రతినిధులుగా బి.అంజలి మాదిగ, కె.రజిత మాదిగ, బి.అంజలీ మాదిగ, ఉపాధ్యక్షులుగా కె.హర్షిణి మాదిగ, పి.కీర్తన మాదిగ, కోశాధికారిగా బి.భానుప్రియ మాదిగ, ప్రధాన కార్యదర్శులుగా కె.కీర్తన మాదిగ, రూప మాదిగ, కార్యదర్శులుగా ఎం.భవ్య మాదిగ, బి.జ్యోతిక మాదిగ ఎన్నికయ్యారు. సహాయ కార్యదర్శులుగా కె.రాణి మాదిగ, కె.రమ్య మాదిగ, బి.కీర్తి మాదిగలను ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ కొత్తపేట డివిజన్ అధ్యక్షుడు మంద శేఖర్ మాదిగ, ఎంఎస్పి నాయకుడు మంద రాములు మాదిగతో పాటు పలువురు మాదిగ విద్యార్థులు పాల్గొన్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు నాయకులు అభినందనలు తెలిపారు.



## సంగారెడ్డి ఫ్యాక్టరీలో విషాదం.. గ్యాస్ లీకై ఇద్దరి మృతి

- **సంగారెడ్డి జిల్లా సరాకా పరిశ్రమలో గ్యాస్ లీక్**
- **మృతులు సుదర్శన్, బాలాజీగా గుర్తింపు**
- **యాజమాన్య నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని ఆరోపణలు**
- **ఘటనపై దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు**

**సంగారెడ్డి అక్టోబర్ 23(ప్రజాక్షేత్రం):**

తెలంగాణలోని సంగారెడ్డి జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. జిన్నారం మండలం గడ్డపోతారం పారిశ్రామికవాడలోని 'సరాకా' పరిశ్రమలో గ్యాస్ లీకై ఇద్దరు కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. మృతులను సుదర్శన్, బాలాజీగా గుర్తించారు. గ్యాస్ లీకేజీ కారణంగా ఊపిరాడకపోవడంతోనే వారు మృతి చెందినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ దుర్ఘటనతో పారిశ్రామికవాడలో విషాద ఛాయలు అలముకున్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలపై దర్యాప్తు ప్రారంభించారు. పరిశ్రమలో భద్రతా ప్రమాణాలు పాటించారా? లేదా? అనే కోణంలో విచారణ జరుపుతున్నారు. ఫ్యాక్టరీ యాజమాన్యం నిర్లక్ష్యం, భద్రతా లోపాల కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని మృతుల కుటుంబ సభ్యులు, కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు.




# ప్రజాస్వామ్యానికి పరీక్ష.. స్థానిక ఎన్నికల్లో స్వేచ్ఛ ఎక్కడ?

- **అధికార బలమా? ప్రజాబలమా?**
- **నామినేషన్ హక్కుకే అడ్డంకుల ఆరోపణలు.. వైసీపీ ఫిర్యాదులతో రంగంలోకి సుప్రీంకోర్టు.. ఎన్నికల కమిషన్ తీరుపై రాష్ట్రవ్యాప్తంగా చర్చ**





స్థానిక ఎన్నికలు అంటే కేవలం ఓట్ల పండుగ కాదు.. ప్రజాస్వామ్యానికి పునాది. గ్రామ పంచాయతీ నుంచి మున్సిపాలిటీ వరకు ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రతినిధులను ఎన్నుకునే కీలక ప్రక్రియ. అలాంటి ఎన్నికల్లో అభ్యర్థికి నామినేషన్ వేయడానికి స్వేచ్ఛ లేకపోతే, ఓటరుకు భయం లేకుండా ఓటు వేసే పరిస్థితి లేకపోతే ప్రజాస్వామ్య స్ఫూర్తికే విఘాతం కలుగుతుంది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల పరిణామాలు ఇదే ప్రశ్నను ముందుకు తెస్తున్నాయి.

**ఎన్నికల వేళ ఎందుకీ వివాదం?**

ఆంధ్రప్రదేశ్‌లో 13 మున్సిపల్ కార్పొరేషన్లు, 87 మున్సిపాలిటీలు, నగర పంచాయతీలతో కూడిన 100 పట్టణ స్థానిక సంస్థలకు ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. అక్టోబర్ 16 నుంచి 18 వరకు నామినేషన్ల స్వీకరణ, అక్టోబర్ 19న పరిశీలన జరగాల్సి ఉంది. అయితే, నామినేషన్ల సమయంలో తమ పార్టీ అభ్యర్థులను అడ్డుకున్నారని, బెదిరింపులు, దాడులు జరిగాయని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. ఈ ఆరోపణలపై న్యాయపోరాటం జరగడంతో వ్యవహారం సుప్రీంకోర్టు వరకు వెళ్లింది.

అక్టోబర్ 21న సుప్రీంకోర్టు తుది అభ్యర్థుల జాబితా ప్రచురణను వాయిదా వేయాలని, అభ్యర్థులు నామినేషన్లు వేయలేకపోయినట్లు వచ్చిన ఫిర్యాదులను, అందుకు సంబంధించిన ఆధారాలను పరిశీలించాలని ఎన్నికల కమిషన్‌ను ఆదేశించింది. అనంతరం అక్టోబర్ 22న కమిషన్ నాలుగు పట్టణ స్థానిక సంస్థల్లో నామినేషన్లకు అదనపు అవకాశం కల్పిస్తూ నిర్ణయం తీసుకుంది. అక్టోబర్ 23న వెలువడిన తాజా నివేదికల ప్రకారం పట్టణ స్థానిక సంస్థల పోలింగ్ నవంబర్ 1కు, ఓట్ల లెక్కింపు నవంబర్ 3కు మార్చబడింది.

**నామినేషన్ హక్కు ఎవరి దయాదాక్షిణ్యాల మీద ఆధారపడకూడదు**

ఎన్నికల్లో పోటీ చేయడం ప్రతి అర్హుడైన అభ్యర్థికి చట్టబద్ధమైన హక్కు. అధికార పార్టీ అభ్యర్థి అయినా, ప్రతిపక్ష పార్టీ అభ్యర్థి అయినా, స్వతంత్ర అభ్యర్థి అయినా నామినేషన్ దాఖలు చేసేందుకు సమానమైన అవకాశం ఉండాలి. నామినేషన్ పత్రాలను సమర్పించకుండా అడ్డుకోవడం, బెదిరించడం, దాడి చేయడం వంటి చర్యలు నిజమని తేలితే అవి తీవ్రమైన ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యలే.

అయితే, రాజకీయ పార్టీలు చేసే ఆరోపణలన్నింటినీ విచారణ లేకుండానే నిజాలుగా ప్రకటించడం కూడా సరైన జర్నలిజం కాదు. ప్రతి ఫిర్యాదుకు ఆధారాలు ఉండాలి. సీసీటీవీ దృశ్యాలు, వీడియో రికార్డులు, పోలీసు నివేదికలు, రిటర్నింగ్ అధికారుల వివరాలు, బాధితుల వాంగ్మూలాలు పరిశీలించాలి. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి కూడా తమ వాదన వినిపించే అవకాశం ఉండాలి. నిజానిజాలను తేల్చాల్సింది రాజకీయ ప్రచారం కాదు.. నిష్పాక్షిక విచారణ.

**వైసీపీ ఆరోపణలు.. టీడీపీ బాధ్యత**

ప్రతిపక్షమైన వైసీపీ ఎన్నికల ప్రక్రియలో తమ అభ్యర్థులకు అడ్డంకులు ఎదురయ్యాయని ఆరోపిస్తూ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. ఈ ఫిర్యాదులపై సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవడం, ఎన్నికల కమిషన్ అదనపు అవకాశాలపై నిర్ణయం తీసుకోవడం ఎన్నికల స్వేచ్ఛకు సంబంధించిన అంశాల ప్రాధాన్యాన్ని తెలియజేస్తున్నాయి.

అదే సమయంలో అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం, అధికార యంత్రాంగం, పోలీసు వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలిగించే బాధ్యతను కలిగి ఉన్నాయి. ఎన్నికల్లో అధికార పార్టీ గెలవాలా, ప్రతిపక్షం గెలవాలా అనేది ప్రజలు నిర్ణయించాలి. కానీ పోటీలోకి దిగే అవకాశం కూడా లేకుండా చేసే పరిస్థితి ఏర్పడితే ప్రజల తీర్పుకు ముందే ఫలితాన్ని ప్రభావితం చేసినట్లవుతుంది.

టీడీపీపై వచ్చిన ప్రతి ఆరోపణ నిరూపితమైందని చెప్పలేం. అలాగే, ఆరోపణలు ఉన్నాయనే కారణంతో వాటిని తేలికగా తీసిపారేయలేం. అధికార పక్షం తన వైఖరిని పారదర్శకంగా చూపించాలి. ప్రతిపక్షం కూడా ఆధారాలతోనే తన వాదనను ముందుకు తీసుకెళ్లాలి.

**ఎన్నికల కమిషన్ పరీక్ష ఇప్పుడే మొదలైంది**

ఎన్నికల కమిషన్ బాధ్యత నోటిఫికేషన్ విడుదల చేయడంతో ముగియదు. ఎన్నికల ప్రక్రియలో ప్రతి అభ్యర్థికి సమాన అవకాశం కల్పించడం, ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించడం, అధికారులపై రాజకీయ ఒత్తిళ్లు లేకుండా చూడడం, ఓటర్లు భయరహితంగా ఓటు వేసే వాతావరణాన్ని కల్పించడం కూడా దాని విధుల్లో భాగమే.

నామినేషన్లపై వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి కొన్ని ప్రాంతాల్లో అదనపు అవకాశం కల్పించడం ఒక చర్య. కానీ అంతటితో సమస్య పరిష్కారమైందని చెప్పలేం. సంబంధిత ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లు ఎలా ఉన్నాయి? బాధిత అభ్యర్థులు నిజంగా నామినేషన్లు దాఖలు చేయగలిగారా? ఫిర్యాదులకు సంబంధించిన ఆధారాలను పరిశీలించారా? తప్పు చేసినవారిపై చర్యలు తీసుకున్నారా? ఈ ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు రావాలి.

ఎన్నికల కమిషన్ తీసుకునే నిర్ణయాలు ప్రజలకు అర్థమయ్యేలా ఉండాలి. ఏ ప్రాంతంలో ఎంతమంది ఫిర్యాదు చేశారు? ఎన్ని ఫిర్యాదులు పరిశీలించారు? ఎన్ని నిజమని తేలాయి? ఎన్ని తిరస్కరించారు? ఎందుకు తిరస్కరించారు? అనే వివరాలను సాధ్యమైనంత పారదర్శకంగా వెల్లడించాలి. అప్పుడు మాత్రమే కమిషన్‌పై విశ్వాసం పెరుగుతుంది.

**కార్యకర్తల మధ్య ఘర్షణలు.. నష్టపోయేది ప్రజలే**

ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీల కార్యకర్తల మధ్య ఉద్రిక్తతలు పెరగడం కొత్త విషయం కాదు. కానీ రాజకీయ ప్రత్యర్థిని శత్రువుగా చూడటం, వ్యక్తిగత దాడులకు దిగడం, కుటుంబాలను భయభ్రాంతులకు గురిచేయడం ప్రజాస్వామ్య సంస్కృతికి విరుద్ధం. పార్టీ జెండాలు వేరు కావచ్చు. రాజకీయ అభిప్రాయాలు వేరు కావచ్చు. అయినప్పటికీ ప్రతి పౌరుడికి చట్టపరమైన రక్షణ సమానంగా ఉండాలి.

వైసీపీ కార్యకర్తలపై దాడులు జరిగినట్లు ఫిర్యాదులు వస్తే వాటిని విచారించాలి. టీడీపీ కార్యకర్తలపై దాడులు జరిగినా అదే విధంగా చర్యలు తీసుకోవాలి. ఏ పార్టీకి చెందిన వ్యక్తి తప్పు చేసినా చట్టం ముందు బాధ్యత వహించాలి. రాజకీయ అనుబంధాన్ని బట్టి పోలీసుల స్పందన మారితే ప్రజల్లో వ్యవస్థపై విశ్వాసం దెబ్బతింటుంది.

ఎన్నికల సమయంలో శాంతిభద్రతలను కాపాడటం పోలీసుల బాధ్యత. ఫిర్యాదు చేసేందుకు వచ్చిన అభ్యర్థిని తిప్పిపంపడం, అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించారనే అనుమానాలకు తావివ్వడం, ప్రతిపక్ష కార్యకర్తల ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయడం వంటి పరిస్థితులు తలెత్తకుండా ఉన్నతాధికారులు పర్యవేక్షించాలి. అదే సమయంలో తప్పుడు ఫిర్యాదులు, రెచ్చగొట్టే చర్యలు, హింసకు పాల్పడేవారిపైనా నిష్పాక్షికంగా చర్యలు తీసుకోవాలి.

**ఓటరే అసలైన యజమాని**

స్థానిక సంస్థల ఎన్నికల్లో రాజకీయ పార్టీలు అధికారాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటాయి. కానీ ప్రజలకు కావాల్సింది పార్టీ పోరు కాదు.. తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, మురుగునీటి వ్యవస్థ, ఆరోగ్య సదుపాయాలు, పారదర్శకమైన స్థానిక పాలన.

ఎన్నికల్లో గెలిచినవారు ప్రజలకు జవాబుదారీగా ఉండాలి. ఓడిపోయినవారికి కూడా ప్రజా సమస్యలను లేవనెత్తే హక్కు ఉండాలి. ఎన్నికల ప్రక్రియలో పోటీని అడ్డుకోవడం, ప్రత్యర్థులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం, అధికారాన్ని వ్యక్తిగత ప్రయోజనాలకు వినియోగించడం వంటి చర్యలకు ప్రజాస్వామ్యంలో స్థానం ఉండకూడదు.

ఓటరు తనకు నచ్చిన అభ్యర్థిని ఎంచుకునే స్వేచ్ఛ కలిగి ఉండాలి. అతని ఓటు విలువను డబ్బు, బెదిరింపులు, అధికార ఒత్తిళ్లు నిర్ణయించకూడదు. ఎన్నికల అసలు విజయం ఎవరెన్ని స్థానాలు గెలిచారనే దానిలో మాత్రమే లేదు. ప్రజలు భయం లేకుండా తమ తీర్పును వెల్లడించగలిగారా లేదా అన్నదే ప్రధాన ప్రమాణం.

**నిష్పాక్షిక విచారణే పరిష్కారం**

ప్రస్తుతం అవసరమైనది పరస్పర రాజకీయ నిందారోపణలు కాదు. ప్రతి ఫిర్యాదుపై ఆధారాలతో కూడిన విచారణ, అభ్యర్థులకు భద్రత, నామినేషన్ల స్వీకరణలో పారదర్శకత, పోలీసుల నిష్పాక్షికత, ఎన్నికల కమిషన్ స్పష్టమైన చర్యలు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సంబంధిత అధికారులు తమ చర్యల వివరాలను సమర్పించాలి. ఫిర్యాదులు నిజమని తేలితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. నిరాధారమైన ఆరోపణలు చేసినా చట్టబద్ధమైన మార్గాల్లోనే వ్యవహరించాలి.

ఎన్నికల తేదీలను మార్చడం తాత్కాలిక పరిష్కారం మాత్రమే. ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు నమ్మకం కల్పించడం శాశ్వత పరిష్కారం. ప్రజాస్వామ్యాన్ని కాపాడేది ఒక పార్టీ విజయం కాదు.. ప్రతి పౌరుడి హక్కుకు లభించే గౌరవం.

**గెలుపు కంటే ప్రజాస్వామ్యం ముఖ్యం**

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు అధికార, ప్రతిపక్ష పార్టీలకు రాజకీయ పరీక్ష మాత్రమే కాదు. ఎన్నికల కమిషన్ విశ్వసనీయతకు, పోలీసు వ్యవస్థ నిష్పాక్షికతకు, ప్రభుత్వ బాధ్యతాయుత వైఖరికి కూడా పరీక్ష. ఈ పరీక్షలో ఏ వ్యవస్థ విఫలమైనా నష్టం ఒక్క పార్టీకి మాత్రమే కాదు.. ప్రజాస్వామ్యానికే.

టీడీపీ అయినా, వైసీపీ అయినా ప్రజల తీర్పును గౌరవించాలి. అభ్యర్థులకు పోటీ చేసే హక్కు, ఓటర్లకు స్వేచ్ఛగా ఓటు వేసే హక్కు, పౌరులకు ప్రశ్నించే హక్కు భద్రంగా ఉండాలి. అధికారంలో ఉన్నవారు అధికారాన్ని ప్రదర్శించడానికి కాదు.. ప్రజాస్వామ్యాన్ని రక్షించడానికి ముందుండాలి. ప్రతిపక్షం ఆరోపణలకే పరిమితం కాకుండా ఆధారాలతో పోరాడాలి. ఎన్నికల కమిషన్ ఎవరి పక్షానా కాకుండా రాజ్యాంగబద్ధమైన నిష్పాక్షికతకు ప్రతీకగా నిలవాలి.ఎందుకంటే ఎన్నికల్లో గెలిచేది ఒక పార్టీ కావచ్చు. కానీ ప్రజాస్వామ్యం ఓడిపోతే నష్టపోయేది మొత్తం సమాజమే.



ఏం రవీందర్
సీనియర్ జర్నలిస్టు
79015036777

# తహసీల్దార్ సంతకం, ముద్ర ఫోర్జరీ

- **నకిలీ ఫ్యామిలీ సర్టిఫికెట్‌తో భూముల మ్యుటేషన్‌కు యత్నం!**
- **కరీమాబాద్ మహిళపై నాలుగు సెక్షన్ల కింద కేసు నమోదు**
- **దర్యాప్తు చేపట్టిన ఏజే మిల్స్ కాలనీ పోలీసులు**

**వరంగల్ ప్రతినిధి అక్టోబర్ 23(ప్రజాక్షేత్రం):**

భూముల మ్యుటేషన్ కోసం నకిలీ ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ సృష్టించిన వ్యవహారం వరంగల్‌లో వెలుగుచూసింది. ధ్రువపత్రంపై ఖిలా వరంగల్ తహసీల్దార్ సంతకాన్ని ఫోర్జరీ చేయడంతో పాటు నకిలీ ముద్రను ఉపయోగించినట్లు తహసీల్దార్ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కరీమాబాద్‌కు చెందిన మెహరున్నీసా బేగంపై ఏజే మిల్స్ కాలనీ పోలీసులు నాలుగు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఎఫ్ఐఆర్ నంబర్ 780/2026తో అక్టోబర్ 17, 2026న రాత్రి 10 గంటలకు కేసు నమోదైంది. ఖిలా వరంగల్ తహశీల్దార్ ఎం.డి. ఇక్బాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు భారతీయ న్యాయ సంహిత సెక్షన్లు 318(4), 336(3), 340(2), 337 కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ శివరాత్రి మహేష్ దర్యాప్తు చేస్తున్నారు.

కరీమాబాద్‌కు చెందిన మెహరున్నీసా బేగం తన భర్త దివంగత మహమ్మద్ అబ్దుల్ రహీం పేరుతో ఉన్నట్లు పేర్కొంటూ ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌ను ఆత్మకూరు తహసీల్దార్‌కు సమర్పించారు. సర్టిఫికెట్ నంబర్ సి/3223/2026, తేదీ 08012026గా ఉంది. దీని ప్రామాణికతపై అనుమానం రావడంతో ఆత్మకూరు తహసీల్దార్ ఖిలా వరంగల్ తహశీల్దార్ కార్యాలయాన్ని వివరణ కోరారు.

**జారీ చేయని ధ్రువపత్రం.. ఫోర్జరీ సంతకం?**

ఖిలా వరంగల్ తహసీల్దార్ కార్యాలయంలోని రికార్డులు, పంపిణీ రిజిస్టర్‌ను పరిశీలించగా, 2026లో ఆ నంబరుతో ఎలాంటి ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ జారీ కాలేదని తేలినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో సదరు ధ్రువపత్రం నకిలీదిగా గుర్తించినట్లు అధికారులు తెలిపారు. తహసీల్దార్ సంతకం, కార్యాలయ ముద్రను కూడా నకిలీగా ఉపయోగించినట్లు ఫిర్యాదులో వివరించారు. ఇతర వారసుల పేర్లను చేర్చకుండా నకిలీ ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ సృష్టించి, ప్రధానమైన వ్యవసాయ భూములను తమ పేర్లపైకి మ్యుటేషన్ చేయించుకునేందుకు ప్రయత్నించినట్లు తహసీల్దార్ తన ఫిర్యాదులో ఆరోపించారు. ఈ వ్యవహారంలో జైనాబీ, మహమ్మద్ అబ్దుల్ రహీం, మెహరున్నీసా బేగం, మహమ్మద్ పర్వేజ్ పేర్లను ప్రస్తావించారు.

**లోతుగా దర్యాప్తు చేస్తున్న పోలీసులు**

తహశీల్దార్ ఎం.డి. ఇక్బాల్ ఆర్‌సీ నంబర్ సి/2912/2026తో అక్టోబర్ 17న ఏజే మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ అధికారులకు లేఖ రాశారు. మెహరున్నీసా బేగం (ఇంటి నంబర్ 16 1881, కరీమాబాద్)పై క్రిమినల్ కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. కేసు నమోదు చేసిన పోలీసులు ఈ ధ్రువపత్రం తయారీ వెనుక మరెవరైనా ఉన్నారా? ఇలాంటి నకిలీ పత్రాలు మరిన్ని సృష్టించారా? అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



Office of the
Tahsildar, Khila Warangal (M)

Rc.No.C/2913/2026
From
Sri. Md Iqbal
Tahsildar, Khila Warangal

Dated:17/10/2026
To
Station House Officer
Police Station, Mills Colony

Sir,

Sub: Revenue Department - Alleged Forgery and use of a Fake Family Member Certificate by Smt. Meherunnisa Begum W/o Late Mohammed Abdul Raheem - Kareemabad Village - Khila Warangal Mandal - Request to file criminal case against the individual - Reg.

Ref:- 1. The Tahsildar, Athmakur, Bhongiri District Rc.No. A/437/2026, Dt: 09.10.2026.
2. Fake Family Member Certificate bearing D.Dis.No. C/3223/2026, Dt: 08.01.2026, allegedly obtained in the name of Smt. Meherunnisa Begum.
3. Report of the Mandal Girdawar, Khila Warangal Dt: 09.10.2026.

&&&

I invite attention to the reference 1st cited, The Tahsildar Athmakur(M) Bhongir District has requested to verify the genuineness of the Family Member Certificate bearing D.Dis.No. C/3223/2026, Dt: 08.01.2026 said to be issued by Tahsildar, Khila Warangal in the name of Smt. Meherunnisa Begum, W/o Late Abdul Raheem, R/o H.No. 16-1-881, Kareemabad, Khila Warangal, Kareemabad Village, Khila Warangal Mandal, Warangal District.

In this connection, it is to inform that on verification of Office Records and Distribution Register pertains to Year - 2026, it revealed that this office has not issued any Family Member Certificate bearing D.Dis.No.C/3223/2026, dated 08.01.2026, in favour of Smt. Meherunnisa Begum, W/o Late Abdul Raheem, R/o Karemabad Village, Khila Warangal Mandal and the Family Member Certificate mentioned in reference 1st cited is Tampered and Fake Family Member Certificate.

It is further informed that based on the verification of Family Member Certificate which was forwarded by the Tahsildar, Athmakur, Yadadri Bhuvanagiri District it is clearly established that the family members of the deceased i.e Jainabee, Mohammad Abdul Raheem, Meharunisa Begum, Mohammad Parveen created fake and fabricated family member certificate without mentioning the other and actual family members of the deceased person and trying to mutate the prime agriculture lands with use of fake family member certificate and there is a need to conduct detailed investigation by the Police Department to avoid further fake certificates for different purposes. Further it is also noticed that they also forged signatures of Tahsildar, Khila Warangal and used office seal for creating fake family member certificate.

In view of the above facts, I request to file a criminal case against Smt. Meherunnisa Begum W/o Late Abdul Raheem, R/o 16-1-881, Kareemabad, Khila Warangal and take further action against her under the suitable provisions of law.

Enc: As above

Yours faithfully,
17/10/26
Tahsildar,
Tahsildar
Khila Warangal,
Warangal Dist

Copy submitted to the District Collector, Warangal for favour of kind information.
Copy submitted to the Revenue Divisional Officer, Warangal for kind information.

Scanned with OKEN Scanner

Printed, Published and Owner by K PRAVEEN KUMAR, Printed at MR Publications, A-20, Vambay Colony, Upparpally, Ranga Reddy (Dist), Hyderabad, Telangana 500048. Published at H.NO. 2-50 Shankar pally, Ranga Reddy. Hyderabad, Telangana 501203. Editor: KPRAVEEN KUMAR. Phone number 9177920459, email id: prajakshetram1@gmail.com, https://prajakshetram.com PRGI NO. TGTEL/25/A2394